

పొంగూరు రెవెన్యూలో ప్రభుత్వ భూమిని చదును చేసిన దృశ్యం

ప్రభుత్వ భూమి.. కబ్జా చేసేయ్!

- మర్రిపాడులో బరితెగిస్తున్న ఆక్రమణదారులు
- తెరవెనుక వైసీపీ నాయకుల అండ
- ఎన్నికల విధులంటూ అధికారుల తాత్సారం

మర్రిపాడు, జూన్ 14 : జిల్లాకు విసిరేసినట్టు ఉన్న మర్రిపాడు మండలంలో కబ్జాదారులు పేట్రేగిపోతున్నారు. ఈ ప్రాంతంపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టి అంతంత మాత్రంగా ఉండటం, ఎన్నికల విధుల కోసం వచ్చిన మండల అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరించడం ఆక్రమణదారులకు బాగా కలిసి వస్తోంది. దీంతో ఖాళీ జాగా కనిపిస్తే చాలు రాత్రికి రాత్రే హస్తగతం చేసుకుంటున్నారు. మండలంలోని పొంగూరు, బూదవాడు, చిలకపాడు, అల్లంపాడు గ్రామ పరిసరాల్లో ప్రభుత్వ భూముల్లో ఉన్న ముళ్ల చెట్లను తొలగించి, చుట్టూ ఫెన్సింగ్ వేసి తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఈ భూములన్నీ ముంబయి జాతీయ రహదారికి పక్కనే ఉండటంతో ఒక్కో ఎకరా లక్షల రూపాయలు విలువ పలుకుతోంది. కేవలం గడిచిన ఇరవై రోజుల వ్యవధిలోనే వైసీపీకి చెందిన కొంతమంది నాయకుల ప్రోద్బలంతో అక్రమార్కులు బరితెగిస్తున్నారనే విమర్శలు జోరందుకున్నాయి. పొంగూరు రెవెన్యూలో నెల్లూరు-ముంబయి జాతీయ రహదారి వెంబడి ఉన్న సుమారు 7ఎకరాల ప్రభుత్వ భూమిలో రాత్రికి రాత్రే చెట్లు తొలగించి జామాయిల్ నాటేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ ఎకరా భూమి ఆరు లక్షల రూపాయలకు పైగా పలుకుతోంది. అలాగే చిలకపాడు రెవెన్యూలోని ఏపిలగుంట గ్రామంలో ఇళ్ల పక్కనే ఉన్న సర్వేనెంబర్ 639లో సుమారు 50 సెంట్ల ప్రభుత్వ భూమిని వైసీపీకి చెందిన ఓ నేత ఆక్రమించి ఫెన్సింగ్ వేశారు. అంతేగాక ఆ స్థలంలో ఓ రేకుల షెడ్డును కూడా నిర్మించారు. ఇక్కడ సెంటు భూమి రూ.70వేల వరకు పలుకుతోంది. బూదవాడ వద్ద జాతీయ రహదారి వెంబడి చెరువుకు సంబంధించిన సర్వే నెంబరు 579లో ప్రభుత్వానికి చెందిన ఎకరా భూమిని కబ్జాదారులు హస్తగతం చేశారు. సుమారు రూ.11లక్షలు విలువ జేసే ఈ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అల్లంపాడు రెవెన్యూలో ఇంటి స్థలాలకు కేటాయించిన ఎకరా ప్రభుత్వ భూమిని వైసీపీకి చెందిన ఓ మహిళా నేత ఆక్రమించేసి ఫెన్సింగ్ వేశారు. ఈ భూమి విలువ రూ.60 లక్షల నుంచి 70 లక్షల వరకు పలుకుతోంది. ఇలా ప్రభుత్వ భూమిని ఇష్టానుసారంగా కబ్జా చేస్తున్నా అధికారులు మాత్రం పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు.



ఏపిలగుంట వద్ద ప్రభుత్వ భూమిలో నిర్మించిన రేకుల షెడ్డు

ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తాం

ప్రభుత్వ భూముల ఆక్రమణపై స్థానికులు మా దృష్టికి తెచ్చారు. ఎన్నికల పనిలో ఉన్నందున సమయం కుదరలేదు. ఆ భూముల్లో సర్వే చేసి అక్రమంగా వేసిన ఫెన్సింగ్‌ను తొలగిస్తాము. ముందుగా ఆక్రమణదారులకు చట్ట ప్రకారం నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాము.

\- సీతారత్నం, మర్రిపాడు తహసీల్దారు

పింఛనుదారులకు 'ఎన్టీఆర్ భరోసా'

- వృద్ధులు, వితంతువులకు రూ.3వేల నుంచి 4వేలకు పెంపు
- దివ్యాంగులకు రెండింతల పెరుగుదల
- కిడ్నీ బాధితులకు రూ.10వేలు
- లబ్ధిదారుల్లో ఆనందం

నెల్లూరు (హరనాథపురం), జూన్ 14 : ఎన్టీఆర్ భరోసా పేరుతో పింఛనుదారులకు జూలై నెల నుంచి సామాజిక భద్రతా పింఛన్లు అందనున్నాయి. వృద్ధులు, వితంతువులు తదితరులకు రూ.వెయ్యిగా ఇస్తున్న పింఛన్‌ను 2019లో చంద్రబాబు రూ.2వేలకు పెంచారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రూ.250 వంతున ఐదేళ్లలో రూ. వెయ్యి పెంచి రూ.3వేలు చేసింది. 2024 ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల కనుగుణంగా సామాజిక పింఛన్ల పెంపు దస్త్రంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సంతకం చేశారు. దీంతో పింఛను మొత్తం పెంపు జీఓ విడుదలైంది. వృద్ధులు, వితంతువులు, ఒంటిరి మహిళలు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, ట్రాన్స్‌జండర్లు, హెచ్ఐవీ బాధితులు, కళాకారులకు ఇప్పటి వరకు అందుతున్న రూ. 3వేల పింఛన్‌ను రూ.4వేలకు పెంచారు. వీరికి ఏప్రిల్ 1 నుంచి పెంపును అమలు చేసి, జులై ఒకటిన పింఛను కింద వీరికి రూ.7వేలు (జులై1న ఇచ్చే రూ.4 వేలు, ఏప్రిల్ నుంచి 3 నెలలకు రూ.వెయ్యి వంతున కలిపి) అందచేయనున్నారు. అదేవిధంగా దివ్యాంగులకు ఎన్నడూ లేని విధంగా వారి పింఛను మొత్తాన్ని రూ.3 వేల నుంచి 6వేలకు పెంచారు. కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి చేసుకున్న వారికి, డయాలసిస్ స్టేజ్‌కు ముందున్న కిడ్నీ వ్యాధిగ్రస్థులకు పింఛనుగా అందే రూ.5వేల మొత్తాన్ని 10వేలకు పెంచారు. కుష్టు కారణంగా బహుళ వైకల్యం సంభవించిన వారికి రూ. 6వేల పింఛను ఇస్తారు. పూర్తిస్థాయిలో అస్వస్థతకు గురైన వారికి, తీవ్ర అనారోగ్యంతో మంచాన పడిన వారికి, వీల్ చైర్‌లో ఉన్న వారికి అందే రూ.5వేల పింఛన్‌ను 15వేలకు పెంచారు. పింఛను పెంపుతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

దివ్యాంగులకు మహర్దశ

సంగం, : కూటమి అధికారంలోకి రావడంతో దివ్యాంగుల్లో జోష్ నెలకొంది. ఇప్పటివరకు రూ.3వేలు పెన్షన్ తీసుకుంటున్న వీరు వచ్చే నెల నుంచి 6వేలు అందుకోనున్నారు. ఎన్నికల హామీలో భాగంగా జులైలో ఒక్కో లబ్ధిదారుడికి పెండింగ్ బకాయితో కలిపి రూ.15 వేలు (ఏప్రిల్, మే, జూన్ నెలల బకాయి రూ.9వేలతోపాటు జులై పింఛన్ 6వేలు మొత్తం రూ.15 వేలు) పెన్షన్ రానుంది. దీనికోసం జిల్లాలోని 33,171 మంది దివ్యాంగులు ఎదురుచూస్తున్నారు. గతంలో ఎన్నడూ ఈస్థాయిలో లబ్ధి చేకూరలేదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పొంగూరు నారాయణకు మున్సిపల్ శాఖ ● దేవదాయ శాఖ మంత్రిగా ఆనం

జిల్లాలోని పట్టణాలు, ఆలయాలకు మహర్దశ

పట్టణాల్లో ప్రతి పేదకూ ఇల్లు ఇస్తాం ● నెల్లూరులో పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

'ఆంధ్రజ్యోతి'తో మంత్రి నారాయణ


జిల్లా అమాత్యులకు

కీలక శాఖలు

నెల్లూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు సిటీ, ఆత్మకూరు ఎమ్మెల్యేలు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలకు రాష్ట్ర క్యాబినెట్‌లో కీలక శాఖలు కేటాయించారు. నారాయణకు మున్సిపల్ శాఖ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖలను కేటాయించారు. రాజధాని రీజియన్ అభివృద్ధి, విస్తరణ (సీఆర్‌డీఏ) కూడా ఈ శాఖలోనే విలీనమై ఉంటుంది. 2014 టీడీపీ క్యాబినెట్‌లో కూడా ఈయనకు ఇదే శాఖలు కేటాయించారు. ఇక ఆనం రామనారాయణరెడ్డికి దేవదాయ శాఖ కేటాయించారు. జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులకు కీలక శాఖలు కేటాయించడంతో జిల్లా పరిధిలోని నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు, జిల్లా పరిధిలోని ప్రముఖ దేవాలయాలకు మహర్దశ పట్టనుంది. జిల్లాకు రెండు మంత్రి పదవులు ఇవ్వడం, ముఖ్యమైన శాఖలు కేటాయించడం పట్ల టీడీపీ నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పొంగూరు నారాయణ ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. పట్టణ ప్రాంతాల అభివృద్ధిలో ప్రభుత్వ ప్రాధాన్యతలను ఇలా వివరించారు. ఆయన మాటల్లోనే..

● **ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు : నారాయణ**

రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణ ప్రాంతాల్లోని ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పట్టణ ప్రాంతాల్లో ఒక్కరు కూడా ఇల్లు లేకుండా ఉండకూడదనే దిశగా పనిచేస్తాం. నెల్లూరు నగరంతో పాటు మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఇల్లులేని ప్రతి పేదకుటుంబానికి పక్కా ఇల్లు మంజూరు చేస్తాము. అలాగే పట్టణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి కొళాయి నీరు ఇవ్వాలన్నది మరో ముఖ్యమైన ప్రాధాన్యతాంశం. ప్రతి కుటుంబం తమ ఇంట్లోనే కొళాయి నీరు పట్టుకునే విధంగా తాగునీటి పథకాలను అమలు చేస్తాము. హైజెనిక్ పద్ధతిలో పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగు చర్యలు చేపడుతాము. మురుగు నీటి కాలువలు, రోడ్లు బాగుచేస్తాము.



ఆనం రామ నారాయణరెడ్డి



పొంగూరు నారాయణ

నెల్లూరు నగరం విషయానికి వస్తే గత ప్రభుత్వం అర్ధంతరంగా ఆపేసిన భూగర్భ డ్రైనేజీ, ఇంటింటికి తాగునీటి పథకాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాము. మౌలిక సదుపాయాలతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే కేంద్రాలుగా పట్టణాలను తయారు చేస్తాము. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా యువతకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాలకు శ్రీకారం చుడుతాం. నెల్లూరు నగరం, ఇతర మున్సిపాలిటీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ ప్రభుత్వానికి ఒక స్పష్టమైన ప్రణాళిక ఉంది. ఆ మేరకు అభివృద్ధి పనులను వేగవంతం చేస్తా"మని నారాయణ చెప్పుకొచ్చారు.

మాత్రలెన్ని మింగినా

జబ్బు తగ్గదే!

- ఈఎస్ఐ కార్మికుల గగ్గోలు
- ఆసుపత్రుల్లో కానరాని విలువైన మందులు
- నాసిరకం మందులు ఇస్తున్నారని విమర్శలు
- మెరుగైన వైద్యం కావాలంటే తిరుపతికి వెళ్లాల్సిందే!



ఆసుపత్రిలో ఉన్న మందులు ఇవే!

నెల్లూరు (వైద్యం) జూన్ 14 : కార్మికులకు వైద్య సేవలు అందించాల్సిన ఈఎస్ఐ ఆసుపత్రులు వైసీపీ ప్రభుత్వంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో కునారిల్లుతున్నాయి. రోగుల నాడి పట్టేందుకు వైద్యులు ఉన్నా అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడంతో అటువైపు వెళ్లేందుకే కార్మికులు జంకుతున్నారు. దీంతో అనేక మంది కార్మికులు ప్రైవేట్ ఆసుపత్రులతోపాటు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన మొదటి రెండేళ్ల పాత మందులతోనే వైద్యసేవలు అందించేది. ఆ తర్వాత పేరు ఊరు లేని కంపెనీల నుంచి మందులు కొనుగోలు చేసిందనే ఆరోపణలు పెల్లుబికుతున్నాయి. ఈఎస్ఐ ఆసుపత్రుల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం 75 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం నిధులు వెచ్చించి మందులు కొనగోలు చేయాలి. అయితే, రాష్ట్ర ప్రభుత్వం తనకు తోచిన మందులనే కొనుగోలు చేసి సరఫరా సరఫరా చేసింది. ఇదేమిటని ప్రభుత్వాన్ని ఎదురించే సాహసం కూడా అధికారులు చేయలేక పోయారు. జిల్లావ్యాప్తంగా వివిధ కంపెనీలలో 25వేల మంది పని చేస్తుండగా, వీరికి నగరంలోని పొదలకూరు రోడ్డులో ఉన్న ఈఎస్ఐ ఆసుపత్రి మాత్రమే అందుబాటులో ఉంది. నవాబుపేటలో ఈఎస్ఐ ఆసుపత్రి ఉన్నా అక్కడ నామమాత్రపు వైద్యసేవలు అందుతున్నాయి. ఎన్ని మందులు వేసుకున్నా జబ్బు తగ్గకపోవడంతో ఈఎస్ఐ ఆసుపత్రులపై నమ్మకం సన్నగిల్లి ఒకప్పుడు రోజుకు 150 మంది వచ్చేవారు ప్రస్తుతం 35 మంది మాత్రమే వస్తున్నారు.

● **పేరులేని మందుల కంపెనీలెన్నో..**

ఒకప్పుడు ఈఎస్ఐ ఆసుపత్రిలో మనిషి ఎదుగుదలకు ఉపయోగపడే రూ.25వేల విలువైన



హార్మోన్ సూదిమందు, కేన్సర్ నియంత్రణకు రూ.60వేలకుపైగా విలువైన ఇంజక్షన్లు, మందులు అందుబాటులో ఉండేవి. అలాగే కీళ్లనొప్పులకు, గాయాలు మానేందుకు అత్యుత్తమ కంపెనీలకు చెందిన మందులు ఇచ్చేవారు. ఇలా దాదాపు 300 రకాల మందులు ఈఎస్ఐ ఆసుపత్రులలో ఉండేవి. అయితే, వైసీపీ ప్రభుత్వ హయాంలో కేవలం 100 రకాల మందులు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. సిగ్నేచర్, ఆల్వాల్యాబ్, యూనిమార్క్ లిమిటెడ్, ప్రిసైసిమి, మిడాస్ ఫార్మా, ఇంటాస్ ఫార్మా వంటి కంపెనీ పేర్లతో ఉన్న మందులు ఈఎస్ఐ ఆసుపత్రి కొనుగోలు చేసింది. ఆసుపత్రికి వచ్చే వ్యాధిగ్రస్థులైన కార్మికులకు విధిలేని పరిస్థితుల్లో వైద్యులు ఉన్న మందులు రాసి, ఇస్తున్నారు.

● **తిరుపతికి వెళ్లాల్సిందే..**

తీవ్ర అనారోగ్యానికి గురైన కార్మికులను గతంలో నారాయణ ఆసుపత్రికి పంపించే వారు. అక్కడ వైద్య ఖర్చులతోపాటు ఇతరత్రా ఖర్చులను కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వమే చెల్లించేది. అయితే వైసీపీ ప్రభుత్వంలో రోగులను తిరుపతిలోని ఈఎస్ఐ ప్రాంతీయ ఆసుపత్రికి సిఫారసు చేస్తున్నారు. అక్కడ వైద్యసేవలు అందినా మందులు మాత్రం నాసిరకంగా ఉంటున్నాయని బాధిత కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఈఎస్ఐ ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య రోజురోజుకు తగ్గుతోంది. ముత్తుకూరు మండలం కృష్ణపట్నం వద్ద ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేశారే తప్ప వైద్యులు, సిబ్బందిని నియమించ లేదు. దీంతో ఆ ఆసుపత్రికి బాడుగ రూపంలో వేల రూపాయలు ఖర్చు చేసి ప్రస్తుతం మూసివేశారు. పరిశ్రమలు ఎక్కువగా ఉన్న ఆ ప్రాంతంలో ఈఎస్ఐ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండిఉంటే కార్మికులకు ఎంతో వెసులు బాటుగా ఉండేది.

బీట్ వ్యవస్థ పటిష్టం

● ఎస్పీ ఆరీఫ్ హఫీజ్

నెల్లూరు(క్రైం), జూన్ 14: నేర నియంత్రణలో భాగంగా బీట్ వ్యవస్థను మరింతగా పటిష్టం చేశామని ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ కోసం జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు రాత్రి బీట్లు ఏర్పాటు చేసుకొని, సమస్యాత్మక గ్రామాల్లో స్థానికులతో గురు, శుక్రవారాల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నెల్లూరు నగర పరిధిలో వంద శాతం బీట్లు కచ్చితంగా ఏర్పాటు చేయాలని, రాత్రి పూట ప్రజల భద్రత, రక్షణకు జిల్లా వ్యాప్తంగా ముమ్మ రంగా గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. గస్తీ సమయంలో తాళాలు వేసిన ఇళ్ల, రైల్వేస్టేషన్లు, బస్టాప్‌లు, ఆలయాలు, బ్యాంక్లు, ఏటీఎంలతోపాటు అన్ని ముఖ్యమైన కూడళ్లలో, నిర్మానుష్యమైన ప్రదేశాల్లో నిఘా ఉంచాలని సూచించారు. రాత్రి వేళ తిరిగే ఆకతాయిలపై, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని, రాత్రి గస్తీ వేళల్లో మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలకు ఏమైనా రక్షణ సహాయం అవసరమైతే తోడ్పాటు అందించాలంటూ దిశా నిర్దేశం చేశారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లి చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని, శాంతియుత వాతావరణంలో జీవించాలని ఎస్పీ కోరారు. కాగా, జిల్లాలోని పలు గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి శుక్రవారం పోలీసు కవాతు నిర్వహించారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట

పోలీసు సిబ్బంది సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నామని, అంకిత భావంతో సిబ్బంది విధులు నిర్వహించాలని ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించారు. సిబ్బంది నుంచి ఎస్పీ అర్జీలను స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడారు. సమస్యలు పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. అనంతరం ఖాళీల ఆధారంగా సిబ్బందికి స్థాన చలనం కల్పించారు.

19, 20 తేదీలలో

జిల్లాలో కేంద్ర బృందం పర్యటన

నెల్లూరు (హరనాథపురం), జూన్ 14 : ఈ నెల 19, 20 తేదీలలో జిల్లాలో కేంద్ర బృందం పర్యటిస్తుందని కలెక్టర్ హరినారాయణన్ ఒక ప్రకటనలో తెలిపారు. రబీ సీజన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆరు జిల్లాలను కరువు జిల్లాలుగా ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో కరువు పరిస్థితిని అంచనా వేయడానికి ఆ బృందం రానున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర పశుసంవర్థక, డెయిరీ శాఖ డైరెక్టర్ సందీప్ శర్మ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు మన్ను జి. ఉపాధ్యాయ్, మదన్‌మోహన్ మౌర్యలతో కూడిన బృందం జిల్లాలో కరువు పరిస్థితిని అంచనా వేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని, కరువు నష్టాన్ని వివరించేలా ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు, పవర్ పాయింట్ ప్రజంటేషన్, రూట్ మ్యాపులు సిద్ధం చేయాని అధికారులను ఆదేశించారు.

రెడ్‌క్రాస్‌లో పురస్కారాలు

నెల్లూరు (వైద్యం) : రక్తదాతల దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని రెడ్‌క్రాస్ కేంద్రంలో శుక్రవారం రక్తదాతలకు పురస్కారాలు అందచేశారు. ఎమ్మెల్సీ, రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి 59 మందికి అవార్డులు అందించారు. రక్తదానం వల్ల దాతలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. త్వరలో రెడ్‌క్రాస్‌లో తలసీమియా క్లినిక్‌ను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ దామిశెట్టి సుధీర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో

ముగ్గురి మృతి

- దువ్వూరు సమీపంలో గేదెలను ఢీకొన్న వ్యాన్
- ఇద్దరు మృతి.. మరో ఇద్దరికి గాయాలు
- కోవూరు సమీపంలో కంటైనర్‌ను ఢీకొన్న లారీ
- ఒకరు మృతి.. మరొకరికి తీవ్రగాయాలు

రహదారులు రక్తపుటేరులుగా మారుతున్నాయి. త్వరగా గమ్యం చేరాలన్న ఆతృత... మితిమీరిన వేగం.. ఆపై నిద్రలేమి తదితర కారణాలతో ప్రమాదాల బారిన పడుతున్నారు. శుక్రవారం వేకువజామున సంగం, కోవూరు సమీపంలో జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృత్యు వాతపడ్డారు.

సంగం : నుజ్జునుజ్జయిన వ్యాన్



సంగం, జూన్ 14: మండల పరిధిలోని దువ్వూరు సమీపంలో ముంబయి జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ఓ వ్యాన్ గేదెను ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. తల్లీబిడ్డకు స్వల్పగాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కృష్ణా జిల్లా కైకలూరుకు చెందిన జయమంగళం నాగరాజు సంగం మండలం శంకరవీరరాఘవపురంలో చేపల చెరువులను లీజుకు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల కిందట స్వగ్రామం కైకలూరుకు వెళ్లి అక్కడ గర్భిణి అయిన తన కుమార్తె అనసూయను, మరో కుమార్తె ప్రశాంతి, మనుమరాలిని వెంటబెట్టుకుని శంకరవీరరాఘవపురం బయలుదేరారు. అర్ధరాత్రి రెండున్నర గంటల ప్రాంతంలో నెల్లూరులో రైలు దిగి బస్సులు లేకపోవడంతో సంగం వైపు వచ్చే పేపర్ వ్యాన్‌లో ఎక్కారు. బుచ్చిరెడ్డిపాళెం దాటిన తరువాత వేగంగా వస్తూ మార్గమధ్యంలోని దువ్వూరు సమీపంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న రెండు గేదెలను వ్యాన్ ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ముందు సీట్‌లో కుర్చొన్న నాగరాజు (45) అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్ శ్రీనివాసులు (40) వ్యాన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. వ్యాన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ శ్రీనివాసులును బయటకు తీసి 108 వాహనంలో వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. వ్యాన్‌లో ఉన్న ప్రశాంతి, ఆమె కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. గర్భిణి అనసూయ ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడింది. కాగా, ఈ ఘటనలో ఓ గేదె మృతి చెందగా, వ్యాన్ నుజ్జునుజ్జయింది. సంగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కోవూరు : కంటైనర్‌ను ఢీకొని నుజ్జునుజ్జయిన మినీలారీ

● **కంటైనర్‌ను ఢీకొన్న మినీ లారీ..**

కోవూరు : చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ఓ లారీ ఆగిఉన్న కంటైనర్ లారీని ఢీకొనడంతో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. చిత్తూరు నుంచి చిలకలూరిపేట సమీపంలోని కావూరు మార్కెట్‌కు మామిడి కాయల లోడుతో ఓ మినీ లారీ గురువారం రాత్రి బయలుదేరింది. శుక్రవారం తెల్లవారుజామున కోవూరు సమీపంలోని ఫ్లైఓవర్ దిగిన తరువాత ఆగి ఉన్న కంటైనర్‌ను మినీలారీ ఢీకొంది. దీంతో కావూరు గ్రామానికి చెందిన మినీ లారీ డ్రైవర్ మొగిలి సతీష్ (30) రెండు వాహనాల మధ్య ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు, వైద్యసిబ్బంది అతికష్టం మీద మృతదేహాన్ని వెలికితీశారు. డ్రైవరు బంధువైన క్లీనరు అజయ్ తీవ్రంగా గాయపటంతో ఆసుపత్రికి తరలించారు. కోవూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





నాగరాజు, శ్రీనివాసులు మృతదేహాలు

నేడు 'గాంధీకి థ్యాంక్స్'

నెల్లూరులో టీడీపీ భారీ ర్యాలీ

నెల్లూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శనివారం 'గాంధీకి థ్యాంక్స్' కార్యక్రమం జరగనుంది. సాయంత్రం నాలుగు గంటలకు నెల్లూరులోని అంబేద్కర్ విగ్రహం నుంచి గాంధీబొమ్మ వరకు భారీ ర్యాలీ జరుగుతుందని, అనంతరం జాతిపితకు కృతజ్ఞతలు తెలియజేసే కార్యక్రమం జరుగుతుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలపై మహాత్ముడి స్ఫూర్తిగా పోరాటం సాగించామని, చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసినప్పుడు 'బాపూకు చెబుదాం' కార్యక్రమాన్ని చేపట్టామని వారు గుర్తు చేశారు. నాటి పోరాట ఫలితంగా నేడు రాష్ట్రంలో ప్రజలు టీడీపీని గెలిపించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని పేర్కొన్నారు.

'ఫోర్జరీ' నిందితులపై చర్యలు తీసుకోవాలి : సీపీఐ

నెల్లూరు(వైద్యం) జూన్ 14 : నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి అరిగెల సాయి డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భవన నిర్మాణం పూర్తి కాకుండానే కమిషనర్ వికాస్ మర్మత్ సంతకాన్ని ఫోర్జరీ చేసి మార్టిగేజ్‌ను విడుదల చేసినట్లు లెక్కల్లో చూపారని మీడియాలో వార్తలు వచ్చాయన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే సీపీఐ ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామరాజు, వాటంబేటి నాగేంద్రబాబు, లీలామోహన్, ముక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్లూం డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలు.. 20న స్పాట్ అడ్మిషన్లు

నెల్లూరు (వ్యవసాయం) : తిరుపతి జిల్లా వెంకటగిరిలోగల శ్రీప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూం టెక్నాలజీ కళాశాలలో మూడేళ్ల డిప్లమో కోర్సులో ప్రవేశాలకు ఈ నెల 20వతేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి వరప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వతరగతి పాసైన అభ్యర్థుల మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. ఈకోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు చేనేత, జౌళిశాఖకు సంబంధించిన ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయని పేర్కొన్నారు. కోర్సు అనంతరం బీటెక్ చదవాలనుకుంటే నేరుగా రెండో సంవత్సరంలో చేరే అవకాశం కూడా ఉందని తెలిపారు. ఉపకారవేతనం కూడా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 9441795408, 9866169908, 9010243054 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రైతులకు పొద్దుతిరుగుడు హైబ్రిడ్ మినీకిట్స్.. ఒకరికి ఒకటి ఉచితం

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 14 : జాతీయ ఆహారభద్రతా పథకం, నూనె గింజలు (నేషనల్ మిషన్ ఆఫ్ ఎడిబుల్ ఆయిల్స్)- 2024 ఖరీఫ్ సీజన్ కింద జిల్లాలో నూనె గింజల పంటలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జిల్లాకు 700 పొద్దుతిరుగుడు హైబ్రిడ్(ఎన్‌డీఎస్‌హెచ్-1012) మినికిట్స్ కేటాయించినట్లు జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మినీకిట్స్‌తోపాటు జీవన ఎరువులైన రైజోబియం, ఫాస్ఫరస్ పాల్యూబులైజింగ్ బ్యాక్టీరియా(పీఎస్‌బీ) కూడా అందజేస్తామని తెలిపారు. ఒక్కో మినికిట్ 2కేజీల పరిమాణంతో ఒక ఎకరాకు సరిపోతుందని, 90 నుంచి 95 రోజుల్లో పంట చేతికొస్తుందని వివరించారు. ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుందని తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రం, మండల వ్యవసాయాధికారి, జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో వ్యవసాయాధికారి రాధ (ఫోన్:8331057212)ను సంప్రదించాలని కోరారు. ఒక రైతుకు ఒక మినికిట్ చొప్పున ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరు ఉపాధ్యాయినుల సస్పెన్షన్

- ఓపెన్ స్కూల్ పరీక్షల్లో అలసత్వం వల్లే..

నెల్లూరు (విద్య), జూన్ 14 : పరీక్షల విధుల్లో అలసత్వం ప్రదర్శించిన ఇద్దరు ఉపాధ్యాయినులను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు ఉత్తర్వులు జారీ చేశారు. అల్లూరు రామకృష్ణ జూనియర్ కళాశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న వై శీనమ్మ, ఎఫ్‌బీసీయూపీ స్కూల్‌లో పనిచేస్తున్న ఏ స్టాలినాను ఇటీవల నిర్వహించిన ఓపెన్‌స్కూల్ పరీక్షలకు కావలిలోని పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్లుగా నియమించారు. పరీక్షలు జరిగే సమయంలో వీరు విధుల్లో అలసత్వం ప్రదర్శించడమేకాక కాపీయింగ్‌కు సహకరించినట్లు జిల్లా పరిశీలకుడు ప్రసన్నకుమార్ గుర్తించారు. దీనిపై సంబంధిత ఇన్విజిలేటర్లను ప్రశ్నించగా వారు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో కాపీయింగ్, విధుల నిర్వ హణపై ఉన్నతాధికారులకు నివేదికలు అందచేశారు. ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాల మేరకు ఇద్దరు ఉపాధ్యాయినులను సస్పెండ్ చేస్తున్నట్లు డీఈవో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆగని తెల్లరాయి అక్రమ రవాణా

- గుర్తించిన గ్రామస్థులు
- ఓ టిప్పరు స్వాధీనం



చేజర్ల పోలీస్ స్టేషన్ వద్ద టిప్పర్

చేజర్ల, జూన్ 14: మండలంలోని పలు ప్రాంతాల్లో తెల్లరాయి అక్రమరవాణా జరుగుతున్నా మైనింగ్ అధికారులు పట్టించుకున్న పాపానపోవడంలేదు. శుక్రవారం తెల్లవారుజామున కోటితీర్థం గ్రామ సమీపం నుంచి టిప్పర్లలో అక్రమంగా తరలిస్తున్న తెల్లరాయిని గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తొలుత నిరాకరించిన పోలీసులు స్థానిక నాయకులు ఈ విషయపై మంత్రికి ఫిర్యాదు చేస్తామనడంతో రంగంలోకి దిగారు. అప్పటికే ఒక టిప్పరు తప్పించుకోగా ఒక టిప్పరును పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం తహసీల్దారు, మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చినా సాయంత్రం వరకు సంబంధిత మైనింగ్ అధికారులు ఎవరూ రాలేదు. ఇకనైనా సంబంధిత అధికారులు అక్రమ మైనింగ్ చేసే వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గండిపాళెం జలాశయంలో పడి వ్యక్తి మృతి

ఉదయగిరి రూరల్, జూన్ 14: గండిపాళెం జలాశయంలో ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘ టన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల తెలి పిన వివరాల మేరకు.. వెం గళరావునగర్ గ్రామానికి చెందిన షేక్ అలీ (35) గండిపాళెంలోని సిమెంట్‌బ్రిక్స్ తయారీ కేంద్రంలో పని చేస్తున్నాడు. బుధవారం గండిపాళెంలో జరుగుతున్న వివాహానికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. వివాహానికి వెళ్లిన అలీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు గాలింపు చర్యలు చేపట్టారు. గండి పాళెం జలాశయం అతిథిగృహం వద్ద షేక్ అలీ ద్విచక్ర వాహనాన్ని బంధువులు గుర్తించారు. అనంతరం జలాశయం వద్దకు చేరుకొని పరిశీలించగా నీటిలో అలీ మృతదేహం తేలాడుతూ కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ వేల్పుల గిరిబాబు, ఏఎస్ఐ శ్రీనివాసులు తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని బంధువులను విచారించి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం కోసం ఉదయగిరి ప్రభుత్వం వైద్యశాలకు తరలించారు. బహిర్భూమికి వెళ్లిన అలీ నీటిలో దిగి ప్రమాదవశాత్తు పడి మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి భార్య హసీనా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనధికార లేఅవుట్లపై చర్యలకు రంగం సిద్ధం

పొదలకూరు, జూన్ 14 : అనధికారిక లే అవుట్‌లపై అధికారులు చర్యలకు రంగం సిద్ధం చేశారు. మండల ఇన్‌చార్జ్ తహసీల్దారు శివరామకృష్ణ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కాకాణి రమణారెడ్డి గార్డెన్స్, టైలర్స్ కాలనీ వద్ద ఏర్పాటుచేస్తున్న పలు లేఅవుట్లను రెవెన్యూ, పంచాయతీ అధికారులు శుక్రవారం పరిశీలించారు. పంచాయతీకి కేటాయించాల్సిన పబ్లిక్ పర్పస్ స్థలాలను అమ్ముకోవడం, నిబంధనలకు విరుద్ధంగా వేసిన లేఅవుట్లపై తక్షణమే చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టినట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దొరబాబు, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్‌వోలు శ్రీహరి, నాగలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు - మోటారు బైక్ ఢీ : ఒకరికి గాయాలు

పొదలకూరు, జూన్ 14 : ఆర్టీసీ బస్సు - మోటారుబైక్ ఢీకొన్న ప్రమాదంలో స్కూటరిస్టు తీవ్రంగా గాయపడిన సంఘటన పొదలకూరు పట్టణంలోని నెల్లూరు - పొదలకూరు ప్రధాన రహదారిలో పాత పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు నుంచి వస్తున్న కలువాయి - సోమశిల ఆర్టీసీ బస్సు రాపూరు మండలం తెగచర్ల నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న స్కూటరిస్టు శివానందరెడ్డిని ఢీకొంది. ఈ ప్రమాదంలో శివానందరెడ్డి మోకాలు విరిగింది. 108 సిబ్బంది క్షతగాత్రుడిని పొదలకూరు సామాజిక వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	157
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	276
స్కిన్‌లెస్	306
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6838
వెండి కిలో ధర	రూ. 90,000
వెండి ఒక గ్రాము	రూ. 92.00

దాడి కేసులో 17 మందికి రిమాండ్

అనంతసాగరం, జూన్ 14: మండలంలోని శంకర నగరంలో మూడు రోజుల క్రితం టీడీపీ వర్గీయులపై వైసీపీ అనుచరులు దాడి చేసిన ఘటనలో ఏడుగురికి గాయలైన విషయం తెలిసిందే. దాడికి పాల్పడిన వారిపై వారిపై హత్యాయత్నంతో పాటు దొమ్మీకేసు నమోదైంది. దీంతో ఈ ఘటనలో పాల్గొన్న వైసీపీ నాయకుడు పార్లపల్లి రవికుమార్‌రెడ్డి, మరో 12 మంది పురుషులు, 4 మహిళలను పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం కోర్టుకు హాజరు పరిచారు. వారికి జడ్జి రిమాండ్ విధించడంతో నెల్లూరు జిల్లా సెంట్రల్ జైలుకు తరలించారు.



సార్.. సార్.. పోస్టింగ్ సార్ !

- పోలీసుల్లో బదిలీల ఫీవర్
- కోరుకున్న పోస్టింగ్ కోసం నాయకుల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు
- గతంలో వేధింపులపై నిలదీస్తున్న నేతలు
- కొందరిని తిప్పి పంపుతున్న వైనం
- పలువురు సరండర్ అంటూ ప్రచారం

నెల్లూరు(క్రైం), జూన్ 14: రాష్ట్ర ప్రజలు ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి భారీ విజయాన్ని అందించారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు చేపట్టిన క్రమంలో పోలీసుల్లో బదిలీ ఫీవర్ మొదలైంది. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులతో పాటు, గతంలో ఇక్కడ పనిచేసే ఎన్నికల సమయంలో ఇతర ప్రాంతాలకు వెళ్లిన అధికారులు సైతం జిల్లాలో పోస్టింగ్ కోసం పోటీ పడుతున్నారు. ఎన్నికల ఫలితాలు విడుదలైన వెంటనే కోడ్ కొనసాగుతోందన్న విషయాన్ని కూడా పక్కన పెట్టి కొందరు పోలీసు అధికారులు పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించారు. నేరుగా కలిసి శుభాకాంక్షలు తెలపడమేకాక 'మమ్మల్ని గమనించండి సారూ..' అంటూ వేడుకొని వచ్చారు. అయితే నాయకులు చూద్దాం అంటూ నవ్వుతూ చెప్పి పంపేయడంతో ఆ డివిజన్ నాదే... ఈ సర్కిల్ నాదే.... ఆ స్టేషన్ నాదే...అంటూ ముందుగానే కర్చీఫులు, దుప్పట్లు వేసుకుంటున్నారు.

ఐదేళ్లు ఇష్టారాజ్యం

ఐదేళ్ల క్రితం వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర మంతటితోపాటు జిల్లాలోనూ పోలీసుల పనితీరు మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. అధికార పార్టీ నాయకుల కనుసైగల్లో పోలీసు వ్యవస్థ నడిచిందని ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టని రోజు లేదు. ఈ ఐదేళ్ల జిల్లాలో కూడా శాంతిభద్రతలు క్షీణించడంతోపాటు, బాధితులపైనే కేసులు నమోదు చేసిన సందర్భాలు అనేకం. ప్రతిపక్షాలపై పోలీసుల వేధిపులు కోకొల్లలు. వైసీపీ పాలనలో నాయకుల మద్దతుతో రౌడీషీటర్లు రాజ్యమేలుతుంటే పోలీసులు వారికి అండగా నిలిచారు. దాడులు, హత్యలు, హత్యాయత్నాలు, వేధింపులు, కబ్జాలు, దోపిడీలు, వైట్‌కాలర్ నేరాలు... ఇలా చెప్పుకుంటూపోతే ప్రశాంతతకు మారుపేరుగా చెప్పుకునే నెల్లూరు జిల్లా గడిచిన ఐదు సంవత్సరాల్లో ఎన్నో సార్లు నేరాలు, ఘోరాలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వార్తల్లో నిలిచింది.

బదిలీ అయినా అయితే బాగుండు!

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే నాడు వేధించిన పోలీసు అధికారులే నేడు పోస్టింగ్ కోసం నాయకుల ఇళ్ల చుట్టూ తిరుగుతు న్నారు. దీంతో పలువురు అధికారులను నాయకులు గేటు బయట నుంచే పంపేస్తున్నట్లు తెలిసింది. కొందరు పోలీసులు అధికారులేమో 'అప్పటి నాయకులు చెప్పింది చేశామేగానీ మీపై ప్రత్యేకంగా పగలు ఏముంటాయి' అంటూ క్షమాణలు చెబుతున్నట్లు పోలీసు శాఖలో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో నాయకులు పలువురు పోలీసులను నిలదీస్తున్నారు. తాము గతంలో ఇచ్చిన ఫిర్యాదుల సంగతి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల పోలింగ్ రోజు మీరు చేసిన హంగామా మా కార్యకర్తలు వీడియోలు తీసి చూపించారులే అని చెబుతుండటంతో 'దేవుడా... పోస్టింగ్ సంగతి తర్వాత, త్వరగా బదిలీలు జరిగి ఇక్కడి నుంచి వెళ్లిపోతే బాగుంటుంది' అన్న భావనలో అధికారులు ఉన్నట్లు సమాచారం. కొందరు అధికారులను ఇప్పటికే సరండర్ చేశారు అన్న ప్రచారం పోలీసు కార్యాలయంలో సాగుతుంది. ఇదిలా ఉంటే మొన్నటి వరకు వైసీపీ పాలనలో రెచ్చిపోయిన పోలీసులు ఇప్పుడు సార్.. సార్ అంటూ బొకేలు తీసుకు వస్తుండటంపై రాజకీయ పార్టీల కార్యకర్తలు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు.

సోమశిలకు 1,850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, జూన్ 14: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శుక్రవారం 1,850 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.341 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

అన్ని వర్గాల్లో పండుగ వాతావరణం

- టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అజీజ్



మాట్లాడుతున్న అబ్దుల్ అజీజ్, పక్కన చేజర్ల

నెల్లూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకోవడంతో రాష్ట్రంలో అన్ని వర్గాల్లో పండుగ వాతావరణం నెలకొందని టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అన్నారు. శుక్రవారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇచ్చిన హామీల్లో భాగంగా చంద్రబాబు ఐదు సంతకాలతో పాలన ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. మెగా డీఎస్సీతో నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారని, పింఛన్ల పెంపుతో పేదలను ఆదుకున్నారని చెప్పారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తూ ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. పేదల కడుపు నింపే అన్నా క్యాంటీన్లు మళ్లీ ప్రారంభమవుతున్నాయని చెప్పారు. స్కిల్ సెన్సెస్ ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే మార్గం ఏర్పడిందన్నారు. ఇప్పటి వరకూ రాజధాని లేని రాష్ట్రంగా ఎగతాళి చేశారని, ఇప్పుడు వారి నోళ్లు మూతపడ్డాయన్నారు. టీడీపీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ప్రతి ఒక్కరిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.

గృహనిర్మాణశాఖలో సిమెంట్ గోల్‌మాల్‌పై విచారణ



హౌసింగ్ కార్యాలయంలో విచారణ చేస్తున్న గృహనిర్మాణశాఖ అధికారులు

సంగం, జూన్ 14: స్థానిక గృహనిర్మాణశాఖలో జరిగిన సిమెంట్ గోల్‌మాల్‌పై గృహనిర్మాణశాఖ అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. హౌసింగ్‌కు సరఫరా చేసే సిమెంట్ గోల్‌మాల్ జరిగిందని గృహనిర్మాణ కాంట్రాక్టర్ వాసుదేవరెడ్డి జిల్లా హౌసింగ్ పీడీకి ఇటీవల ఫిర్యాదు చేశారు. ఆ మేరకు హౌసింగ్ ఈఈ దయాకర్, డీఈ ముక్తహర్ స్థానిక గృహ నిర్మాణశాఖ కార్యాలయంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం ఏర్పాటు చేసి ఏఈపై వచ్చిన ఆరోపణలపై విచారించారు. ఇంతలో వాసుదేవరెడ్డి అక్కడికి వచ్చి ఏఈతో గొడవ పడ్డారు. దీంతో విచారణకు వచ్చిన అధికారులు సర్దిచెప్పి పంపించారు. సిమెంట్ గోల్‌మాల్‌పై నివేదికను జిల్లా అధికారులకు అందచేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ కరీముల్లా, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

త్యాగానికి, పోరాటాలకు ప్రతీక చేగువేరా

నెల్లూరు(వైద్యం), జూన్ 14 : త్యాగానికి, పోరాటాలకు ఆదర్శంగా నిలిచే విప్లవకారుడు చేగువేరా అని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ అన్నారు. శుక్రవారం చేగువేరా 96వ జయంతి సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఎన్టీఆర్ నగర్‌లో నివాళులర్పించారు. నరసింహ మాట్లాడుతూ 1928 జూన్ 14న అర్జెంటీనా దేశంలో జన్మించిన చేగువేరా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టారన్నారు. క్యూబాను సామ్రాజ్యవాదం నుంచి రక్షించడానికి ఫిడేల్ కాస్ట్రో నాయకత్వంలో దళ కమాండర్‌గా వ్యవహరించి ఆ దేశాన్ని రక్షించారని తెలిపారు. అలాంటి వ్యక్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాబు, సాయిగణేష్, శేఖర్, ప్రవీణ, మధు, సాయి తదితరులు పాల్గొన్నారు.

వాగ్దానాలన్నీ నెరవేరుస్తాం : ప్రశాంతిరెడ్డి



కోవూరు, జూన్ 14: ఎన్నికలలో చేసిన వాగ్దానాలన్నీ నెరవేరుస్తామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్పీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రజాసంక్షేమం కోసం ఐదు ఉత్తర్వులపై చంద్రబాబు నాయుడు సంతకాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా నాయకులు మిఠాయిలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యేగా తొలిసారి కోవూరుకు వచ్చిన ప్రశాంతిరెడ్డికి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామాంజనేయులు, సర్పంచు యాకసిరి విజయమ్మ, నాయకులు చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి, కోడూరు కమలాకరరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, కాటంరెడ్డి కృష్ణారెడ్డి, అత్తిపల్లి శివప్రసాదరెడ్డి, ధారా విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ నాయకుల సంబరాలు

కొడవలూరు/విడవలూరు/ఇందుకూరుపేట/బుచ్చిరెడ్డిపాళెం : చంద్రబాబు చేసిన ఐదు సంతకాలపై టీడీపీ శ్రేణులు మండలాల్లో సంబరాలు చేసుకున్నాయి. కొడవలూరు టీడీపీ కార్యాలయంలో జీవీఎన్ శేఖర్ రెడ్డి కేక్ కట్ చేశారు. విడవలూరు ఎమ్పీడీవో కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణచైతన్య, ఎంపీడీవో శ్రీనివాసులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఇందుకూరుపేట మండలం కొత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో టీడీపీ నేతలు రావెళ్ల వీరేంద్రచౌదరి, కల్యాణ్‌రెడ్డి భారీ కేక్ కట్ చేశారు. బుచ్చిరెడ్డిపాళెంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు హరికృష్ణ, హరనాథ్, ఉసురుపాటి, తాళ్ళస్వామి, గుత్తా శ్రీనివాసరావు, పురుషోత్తం పాల్గొన్నారు.

రేపు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ఎన్నికలు

నెల్లూరు (సాంస్కృతికం) : నెల్లూరులోని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. బరిలో ఉన్న అభ్యర్థుల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. వాసవీ మాత ప్యానల్ ఛైర్మన్ అభ్యర్థిగా ఎంపీ ఆంజనేయులు, ఏఎంఆర్ ప్యానల్ ఛైర్మన్ అభ్యర్థిగా కొనగళ్ల శోభన్‌బాబు పోటీ చేస్తున్నారు. ఆ రెండు ప్యానెళ్ల నుంచి 66 మంది, మరో ముగ్గురు స్వతంత్రులు బరిలో ఉన్నారు. ఈ అసోసియేషన్‌లో మొత్తం 403 మంది ఓటర్లు ఉండగా, 33 మంది కమిటీ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈ ఎన్నికలకు న్యాయవాది పీవీ మల్లికార్జున్‌రెడ్డి బృందం పర్యవేక్షిస్తోంది. రంగనాయకులపేటలోని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలింగ్, సాయంత్రం 4గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు.

వీఎస్‌యూలో ఉద్రిక్తత

- వైఎస్ఆర్ విగ్రహం తొలగించాలంటూ ఆందోళన
- టీఎన్ఎస్ఎఫ్ నేతలను అడ్డుకున్న పోలీసులు
- డీఎస్పీ హామీతో వెనుదిరిగిన విద్యార్థి సంఘాలు



విద్యార్థి సంఘాల నేతలతో మాట్లాడుతున్న డీఎస్పీ వీరాంజనేయరెడ్డి

వెంకటాచలం, జూన్ 14 : స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో శుక్రవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గత ఎనిమిది నెలల కిందట యూనివర్సిటీలో పరిపాలన భవనాన్ని నిర్మించి వైఎస్ఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దానిపై అప్పట్లోనే తీవ్ర దుమారం రేగింది. విద్యార్థి సంఘాలు సైతం తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశాయి. కానీ వీసీ సుందరవల్లి, రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి విద్యార్థి సంఘాలు చేసిన ఆందోళనను పట్టించుకోకుండా వైఎస్ఆర్ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. పలుమార్లు విద్యార్థి సంఘాలు వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించి ఆ స్థానంలో స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశాయి. విద్యార్థి సంఘాల డిమాండ్‌ను యూనివర్సిటీ పాలకులు పట్టించుకోలేదు. దీంతో శుక్రవారం మరోసారి టీఎన్ఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు నలబాలపు వెంకటాద్రి ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాల నేతలు వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించాలంటూ ఆందోళనకు దిగాయి. యూనివర్సిటీ పాలకులు విషయాన్ని పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పోలీసులు హుటాహుటిన యూనివర్సిటీకి చేరుకొని ఆందోళనకారులను అడ్డుకొని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ విద్యార్థి సంఘాలు వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించాలంటూ ఆందోళనకు దిగడంతో విషయం నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన రంగంలోకి దిగారు. టీఎన్ఎస్ఎఫ్ నేతలతో మాట్లాడారు. తాము ఇదివరకే వీసీ సుందరవల్లిని వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించమని కోరినా ఆమె పట్టించుకోలేదన్నారు. దీంతో మరోసారి వీసీని కలిసి కోరగా తమకు సరైన సమాధానం కూడా చెప్పకపోవడంతో తాము ఆందోళనకు దిగామని, ప్రతిచర్యగా యూనివర్సిటీ పరిపాలన భవనం వద్ద టీడీపీ ఫ్లెక్సీ కట్టేందుకు పూనుకున్నామన్నారు. దీంతో త్వరలోనే యూనివర్సిటీ ఉన్నతాధికారులతో మాట్లాడి వైఎస్ఆర్ విగ్రహాన్ని వీలైనంత త్వరగా తొలగిస్తామని డీఎస్పీ విద్యార్థి సంఘాలకు హామీ ఇవ్వడంతో శాంతించి ఆందోళనను విరమించుకొని వెనుదిరిగి వెళ్లారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు మనోజ్, అశోక్, సురేష్, మహేష్, పెంచలప్రసాద్, సాయి, పవన్, సూర్య, హర్ష, నవీన్, ప్రకాష్, వెంకటేష్, డేవిడ్‌రాజు, మనోజ్, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతి గృహంలో ప్రవేశాలు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 14 : నెల్లూరులోని విభిన్న ప్రతిభావంతుల బాలికల ప్రత్యేక వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకుడు ఎస్ అక్బర్ అలీ ఓ ప్రకటనలో తెలిపారు. శారీరక అంగవైకల్యం, పాక్షిక అంధత్వం, పాక్షిక వినికిడి లోపం కలిగి, ప్రభుత్వ వైద్యశాల నుంచి ధ్రువీకరణ పత్రం పొందిన బాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9912205985 నంబరును సంప్రదించాలన్నారు.

సహకార సిబ్బందికి శిక్షణ

నెల్లూరు(హరనాథపురం), జూన్ 14 : సమకార సంఘాల సిబ్బందికి శుక్రవారం జిల్లా సహకార శాఖాధికారి గురప్ప ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సెక్షన్ 51పై అవగాహన కల్పించారు. సహకార సంఘాల్లో ఆర్థిక అవకతవకలపై 1964 సెక్షన్ 51 ప్రకారం విచారణ జరపాలని సూచించారు.

మహిళలకు ఆదిశంకర స్త్రీశక్తి అవార్డు

- చైర్మన్ వంకి పెంచలయ్య

నెల్లూరు(హరనాథపురం); జూన్ 14 : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన మహిళలను ఆదిశంకర స్త్రీశక్తి అవార్డుతో సత్కరిస్తామని ఆదిశంకర విద్యాసంస్థల చైర్మన్ వంకి పెంచలయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంవత్సరాన్ని మహిళా సాధికారిత, యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీగా నిర్ణయించబడిందన్నారు. స్త్రీశక్తి అవార్డు దినోత్సవ కార్యక్రమాన్ని ఈ నెల 21న ఉదయం 9గంటలకు ఆదిశంకర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తామని తెలిపారు. అన్ని కళాశాలల, పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. పదవ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని తమ విద్యాసంస్థలు, మహర్షి వేదిక్ యూనివర్సిటీ హాలండ్ వారితో కలిసి పది వేల మంది విద్యార్థులతో యోగా విన్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

నెల్లూరు(వైద్యం) : రక్తదానం ప్రాణదానంతో సమానమని అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలీ తెలియచేశారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని బ్లడ్‌బ్యాంక్‌లో వైద్య ఉద్యోగులు రక్తదానం చేశారు. ఏడీఎంహెచ్‌వో మాట్లాడుతూ రోగులకు అవసరమైన రక్తం అందించేందుకు దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు యువత పెద్ద సంఖ్యలో రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నో ఉద్యమాలకు నిలయంగా ఉన్న నెల్లూరు జిల్లాలో రక్తదాత లు కూడా ఎంతో మంది ఉన్నారని వారు మరికొందరిని రక్తదానం వైపు ప్రోత్సహించాలని కోరారు.

రామలింగేశ్వర స్వామి ఆలయంలో నేడు బహిరంగ వేలం

విడవలూరు : రామతీర్థంలోని కామాక్షిదేవి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 27న ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా గతంలో వాయిదా పడిన కొబ్బరి చిప్పల సేకరణ, తాత్కాలిక అంగళ్ల ఏర్పాటుకు శనివారం ఆలయ ప్రాంగణంలో వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

ముగిసిన గజేంద్ర మోక్షం ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం) : స్టోన్‌హౌస్‌పేట వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న గజేంద్ర మోక్షం ఉత్సవాలు శుక్రవారం రాత్రి ముగిశాయి. ఆలయంలో కొలువైయున్న సీతారామచంద్ర స్వామికి ఈ ఉత్సవాలు నిర్వహించారు. చివరి రోజు దర్బార్ అలంకారం వైభవంగా జరిగింది.

● 17న దీవెన యాత్ర

ఈ నెల 17న తిరుమల శ్రీవారి ఉచిత దీవెన యాత్రను నిర్వహిస్తున్నట్లు సత్యకుమార్ ఫౌండేషన్ ఛైర్మన్ పీ మస్తానమ్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలిపిరి నుంచి శ్రీవారి మెట్ల పూజతో పాదయాత్ర నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 11 గంటలకు నెల్లూరు టౌనుహాలు ప్రాంగణం నుంచి యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. పాల్గొనద లచిన భక్తులు ఉదయం 9గంటలకు టౌనుహాలుకు చేరుకోవాలని కోరారు. ఈ యాత్రను రామాయణం మహేష్‌స్వామి, మాతా అనంతగిరి స్వామి ప్రారంభిస్తారని తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ఉదయగిరి రూరల్, జూన్ 14: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వేల్పుల గిరిబాబు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని వెంగళరావునగర్ గ్రామంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి తనిఖీలు నిర్వహించి సరైన ధ్రువ పత్రాలను లేని వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి ఉండాలని, అల్లర్లు సృష్టించేందుకు యత్నిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

దాడిపై కేసు నమోదు

సంగం, జూన్ 14: మండలంలోని మర్రిపాడులో జీ నవీన్ అనే వ్యక్తిపై దాడి చేసిన కొండయ్యపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల మేరకు.. జీ నవీన్ గురువారం రాత్రి తన ఇంటికి సమీపంలోని అరుగుపై నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఎం కొండయ్య మద్యం మత్తులో కర్రతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారించిన పోలీసులు కొండయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో


రికార్డులు పరశీలిస్తున్న ఎంఈవో జానకీరాం

అనంతసాగరం, జూన్ 14: మండలంలోని వడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలను అనంతసాగరం ఎంఈవో-1 జానకిరాం శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు పుస్తకాల పంపిణీపై ఆరాతీశారు. మెనూ ప్రకారం భోజనం అందిండంలో శ్రద్ధ చూపాలని, విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

సబ్సిడీపై పొద్దుతిరుగుడు విత్తనాల పంపిణీ

ఉదయగిరి రూరల్, జూన్ 14: నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ పథకంలో భాగంగా రైతులకు నూరు శాతం సబ్సిడీపై పొద్దుతిరుగుడు విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఏ ఆంజనేయులనాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అవసరమైన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని ఆయన కోరారు.

50 శాతం రాయితీపై పచ్చరొట్ట విత్తనాల పంపిణీ

ఆత్మకూరు, జూన్ 14 : భూసారం, నేలలో సేంద్రియ కర్బనం పెంపొందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 50 శాతం రాయితీపై సరఫరా చేసిన పచ్చరొట్ట విత్తనాలను మండలంలోని నువ్వూరుపాడులో శుక్రవారం ఏవో కిషోర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకుంటే విత్తనాలు తెప్పించి అందజేస్తామని తెలిపారు.


మంత్రి ఆనంకు అభినందనలు తెలుపుతున్న టీడీపీ నేత కాలం బుజ్జిరెడ్డి


మంత్రి రామనారాయణరెడ్డికి అభినందనలు తెలుపుతున్న బీజేపీ నేతలు

రాష్ట్ర మంత్రి ఆనంకు అభినందనలు

ఆత్మకూరు, జూన్ 14 : రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రిగా నియమితులైన ఆనం రామనారాయణరెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. శుక్రవారం ఆయనను పలువురు టీడీపీ, బీజేపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఆత్మకూరు టీడీపీ నాయకుడు కాలం బుజ్జిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కర్నాటి ఆంజనేయరెడ్డి, సీనియర్ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంది మల్లికార్జునరెడ్డి ఆనం రామనారాయణరెడ్డిని శాలువాతో సన్మానించారు.

ఆనంకు దేవాదాయశాఖ కేటాయింపుపై హర్షం

సంగం : ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి చంద్రబాబునాయుడు మంత్రి వర్గంలో దేవాదాయశాఖ కేటాయింపుపై స్థానిక టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, గంగపట్నం చంద్రశేఖరయ్య శుక్రవారం అమరావతికి వెళ్లి ఆనం రామనారాయణరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు కరుణాకర్‌రెడ్డి, బాణా శ్రీనివాసులురెడ్డి, షేక్ బాబు, అల్లూరు శ్రీధర్‌రెడ్డి, పిట్టు పట్టాభిరామిరెడ్డి, కాకు మధుసూదన్ యాదవ్, ముత్యాల మోహన్, అనిల్‌కుమార్‌రెడ్డి, ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు అభివృద్ధి ఆనంతోనే సాధ్యం

● టీడీపీ శ్రేణుల సంబరాలు

ఆత్మకూరు, జూన్ 14 : ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధి ఆనం రానారాయణరెడ్డితోనే సాధ్యమని పలువురు టీడీపీ నేతలు పేర్కొన్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి రాష్ట్ర దేవాదేయశాఖ మంత్రి పదవి దక్కడంతో టీడీపీ నేతలు, కార్యకర్తలు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని బీఎస్ఆర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విజయోత్సవంలో కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని చిందులు వేశారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జయహో.. అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల చంద్రారెడ్డి, పల్లవోలు జయాకర్, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సుంకర పెంచలచౌదరి, కేతా విజయభాస్కర్‌రెడ్డి, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దావా పెంచలరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాకర్లకు ఎన్‌జీవో ఉద్యోగుల సన్మానం

ఉదయగిరి రూరల్, జూన్ 14: ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్‌ను శుక్రవారం వింజమూరు మండలం బొమ్మరాజుచెరువు గ్రామం వద్ద గల టీడీపీ ప్రధాన కార్యాలయంలో తాలుకా ఎన్‌జీవో అధ్యక్షుడు బొమ్మతట్టు శ్రీహరి, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీవో సంఘ నాయకులు రియాజ్, ఇలియాజ్, వెంకట్రావు, సమద్, అంజాద్, రామ్మోహన్, ఉప్పు కొండయ్య, వెంకటాద్రి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కాకర్లను సన్మానిస్తున్న ఎన్‌జీవో తాలుకా సంఘ అధ్యక్షుడు, సభ్యులు


మూతపడిన సుజలధార కేంద్రం

సుజలధార ప్లాంట్ మూత!

- మరమ్మతులకు గురైన మోటర్లు
- 23 గ్రామాలకు ఆగిన నీటి సరఫరా

అనంతసాగరం, జూన్ 14: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న సుజలధార పథకం ఐదు రోజులుగా పనిచేయడం లేదు. ప్లాంట్‌లోని మోటర్లు మరమ్మతులకు గురి కాగా శుద్ధిజల కేంద్రం మూతపడింది. దీంతో నిర్దేశించిన 23 గ్రామాలకు మినరల్ వాటర్ అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పథకాన్ని 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సుమారు రూ.7 కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేయగా వైసీపీ అధికారంలోకి వచ్చాకా ఎన్‌టీఆర్ సుజలధారను వైఎస్సార్ సుజలధారగా నామకరణం చేశారు. మొత్తం 35 గ్రామాలకు ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేయాల్సి ఉండగా కేవలం 23 గ్రామాలకు నీటి సరఫరా చేస్తూ కాలం వెళ్లతీశారు. అయితే గడిచిన ఐదు రోజులుగా నీటిపథకం మూతపడి మినరల్ వాటర్ అందక ప్రజలు ప్రైవేటు ప్లాంట్ వద్ద నీటిని కొనుగోలు చేసి దాహం తీర్చుకొంటున్నారు. నీటి సరఫరాలో నెలకొన్న ఇబ్బందిపై మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుదర్శన్‌ను వివరణ కోరగా సమస్యను ఉన్నతాధికారులకు వివరించి త్వరలో నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోంటామని చెప్పారు.

అర్హత కలిగిన ఉపాధ్యాయులతో బోధన చేయాలి

ఉదయగిరి రూరల్, జూన్ 14: ప్రైవేటు పాఠశాలల్లో యాజమాన్యాలు అర్హత కలిగిన ఉపాధ్యాయులచే విద్యాబోధన చేయించడంతోపాటు ప్రభుత్వ నియమ, నిబంధనలు పాటించాలని ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ డీఈవో గోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని హోలీఏంజల్స్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్యపుస్తకాలతో మాత్రమే విద్యాబోధన చేయాలన్నారు. విద్యార్థులను తీసుకొచ్చే వాహనాల రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఫోర్స్‌లో ఉండాలన్నారు. అంతకుముందు ఆయన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టూడెంట్ కిట్స్‌ను, గోదామును పరిశీలించి ఉపాధ్యాయులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు షేక్ మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు, కరస్పాండెంట్ వీ.సుధాకర్, ప్రధానోపాధ్యాయులు బాలకేశవులు, మేరీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


హోలీఏంజల్స్ పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో గోపాల్


చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

ఉదయగిరి రూరల్, జూన్ 14: మూడేళ్లు దాటిన ప్రీస్కూల్ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను కోరారు. ఆమె శుక్రవారం పట్టణంలోని కోళ్లవీధి, వాల్మీకివీధి, యాదవపాళెం తదితర ప్రాంతాల్లో అంగన్‌వాడీ చిన్నారులతో బడిబాట ర్యాలీ నిర్వహించి తల్లులకు అవగాహన కల్పించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఇంటింటికెళ్లి ప్రచారం చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం, విద్యాబోధన తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రమీల, భోగ్యం వెంకటరత్నం, ఆయాలు పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, గువ్వాడి అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో శుక్రవారం బడిబాట ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు రజియా, విజయలక్ష్మి మాట్లాడుతూ పిల్లలను తల్లిదండ్రులు తప్పనిసరిగా కేంద్రాలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పీ లాసర్, ఆయాలు కె కృష్ణకుమారి, నాగమ్మ, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.


చిన్నారులతో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

శిథిలావస్థలో పురాతన భవనాలు


శిథిలావస్థలో ఉన్న ఖజానా భవనం

కూలేస్థితిలో ఉన్న జైలు గదులు

ఉదయగిరి, జూన్ 14: ఉదయగిరి పట్టణంలో బ్రిటీష్ పరిపాలన కాలంలో నిర్మించిన పలు భవనాలు నేడు శిథిలావస్థకు చేరాయి. వీటి ఆలనా పాలనా చూసేవారు లేకపోవడంతో భవనాలు పెచ్చులూడి కూలేస్థితికి వచ్చాయి. ఎంతో విలువైన రంగూన్ టేక్ సామాగ్రి సైతం వర్షానికి తడిసి ఎండకు ఎండి చెదలు పడుతోంది. బ్రిటీష్ పాలనలో నిర్మించిన జైలు గదులు, గార్డు భవనం ఖజానా కార్యాలయం రికార్డులు భద్రపరిచే గదులు కోర్టు భవంతులు శిథిలావస్థకు చేరాయి. ఎంతో చరిత్ర కలిగిన ఈ భవనాలకు మరమ్మతులు చేపట్టి వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

దాసరిపల్లిలో వైద్యశిబిరం

ఉదయగిరి రూరల్, జూన్ 14: మండలంలోని దాసరిపల్లి గ్రామంలో జ్వరాలు విజృంభించడంతో గండి పాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది గ్రామం లో ఇంటింటా సర్వే చేపట్టారు సర్వేలో లార్వాతోపాటు. జర్వపీడితులను గుర్తించారు. లార్వా నిర్మూలనకు చర్యలు తీసుకోవడంతోపాటు జ్వరపీడితులకు చికిత్స అందించారు. జిల్లా సహాయ మలేరియా అధికారి నాగార్జున వైద్యశిబి రాన్ని పరిశీలించారు. నివాసాల్లో దోమల నివారణకు పిచికారీ చేపట్టారు. మురికి ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి అంటు వ్యాధులకు దూరంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ మల్లికార్జున, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


ఇంటింటా సర్వే చేపడుతున్న వైద్యఆరోగ్య సిబ్బంది

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి


మాట్లాడుతున్న ఆర్డీవో శీనా నాయక్

ఎన్నికల నిర్వహణ సంతృప్తి నిచ్చింది

● కావలి ఆర్డీవో శీనానాయక్

కావలి, జూన్ 14: కావలి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించటం సంతృప్తిని ఇచ్చిందని కావలి ఆర్వోగా పనిచేసిన ఆర్డీవో శీనానాయక్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల టీంలో పనిచేసిన అధికారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, నోడల్ ఆఫీసర్లు, సీఐలు, వివిధ విభాగాలలో విధులు నిర్వర్తించిన అధికారులంతా ఎన్నికల నిర్వహణలో తమ అనుభవాలను ఆత్మీయ సమావేశంలో పంచుకున్నారు. గతంలో ఎన్నికల నిర్వహణలో పాల్గొన్నప్పటికీ ఈ పర్యాయం ఎన్నికల కమిషన్ కఠోరత్వం చూసి ఎన్నికలు పూర్తి అయ్యే వరకు దినదిన గండంగా ఉండిందన్నారు. ఆర్వో ఒక కార్యాచరణ ప్రకారం టాస్కులు ఇచ్చి మమ్ములను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతో అందరం కలిసి టీంవర్క్‌గా పనిచేసి ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించ గలగామని ఊపిరి పీల్చుకున్నామని తెలిపారు. ఆర్డీవో శీనా నాయక్ మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతో పాటు ఎన్నికలటీంలో ఉన్న సభ్యులందరూ వారి టాస్కులు సమర్ధవంతంగా నిర్వహించటం వలననే ఎలాంటి రిమార్కు లేకుండా సక్సెస్ అయ్యామన్నారు. అలాగే తాము ఏడాది నుంచి ఓటర్ల జాబితాను వ్యూరిఫైడ్ చేసుకుంటూ రావటం వలన ఓటింగ్ శాతం కూడా పెంచగలిగామన్నారు. కావలి డీఎస్పీ ఎం వెంకటరమణ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఎన్నికల నిర్వహణను సీరియస్‌గా తీసుకోవడంతో పాటు తప్పు జరిగితే ఎప్పటికప్పుడు కమిషన్ చర్యలు తీసుకుంటుంటూ పెద్దపెద్ద అధికారులపైనే వేటు వేసిందన్నారు. దీంతో ప్రతి రోజు ఏరోజుకు ఆ రోజు ఊపిరి పీల్చుకుంటూ దినగండంగా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామన్నారు. రెవెన్యూ అధికారులతో పాటు ఎన్నికల టీంలో ఉన్న ప్రతి ఒక్కరు కోఆర్డినేషన్‌తో పనిచేయటం, అదే విధంగా కావలి ప్రజలు కూడా సహరించటంతో శాంతిభద్రతలకు ఎక్కడా భంగం కలుగకుండా ప్రశాంతంగా నిర్వహించగలిగామన్నారు.

సబ్ కలెక్టరును కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, జూన్ 14: కందుకూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం సబ్ కలెక్టరు జీ.విద్యాధరిని మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక టీడీపీ నాయకులు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి సబ్ కలెక్టరు కార్యాలయానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో తాజా పరిస్థితులు, ప్రభుత్వం మారిన నేపథ్యంలో చేపట్టాల్సిన వివిధ అంశాల గురించి వారిమధ్య చర్చ జరిగింది.


సబ్ కలెక్టరుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యేని కలిసిన వైద్యాధికారులు

వలేటివారిపాలెం : మండలంలోని బడేవారిపాలెంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వలేటివారిపాలెం, లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు మండలాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో లింగసముద్రం పీహెచ్‌సీ వైద్యులు పొనుగోటి రమేష్‌బాబు, కొండపల్లి అనూరాధ, సీహెచ్‌వో గుంటుపల్లి శ్రీనివాసులు, వలేటివారిపాలెం పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసులు, శివసిద్దప్ప, గుడ్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మారుతీరావు, కరేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కుంబ శ్రీనివాసులు, డీపీఎంవో దామా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అమృత్ ఫైలాన్ ధ్వంసం కేసు సీఐడీకి అప్పగించాలి

● బీజేపీ నేత భరత్‌కుమార్ యాదవ్

కావలి, జూన్ 14: కావలి పట్టణంలో నిర్మించిన అమృత్ పథకం ఫైలాన్ ధ్వంసం కేసును సీఐడీకి అప్పగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీ.భరత్‌కుమార్ యాదవ్ కోరారు. స్థానిక జర్నలిస్ట్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిగా ముప్పవరపు వెంకయ్య నాయుడి హయాంలో కావలిలో తాగునీటి ఎద్దడి శాశ్వత పరిష్కారం కోసం అమృత్ పథకం మంజూరు చేశారన్నారు. ఆ పథకంకు గుర్తుగా పట్టణ నడిబొడ్డున ఫైలాన్‌ను నిర్మించగా దానిని అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారన్నారు. ఆ ఫైలాన్‌ను 2020 ఏప్రిల్ 10న అప్పటి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, డీఎస్పీ దేవరకొండ ప్రసాద్‌ల సహకారంతో రాత్రికి రాత్రి సీసీ కెమెరాలు నిలుపుదల చేయించి ధ్వంసం చేయించి తెల్లారేసరికి అక్కడ శిథిలాలు కూడా లేకుండా చేశారన్నారు. అప్పట్లో దానిపై రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దానిపై నేటికి ఎలాంటి చర్యలు లేవన్నారు. ఈ కేసును సీఐడీకి అప్పగించి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కే.బ్రహ్మానందం, నేతలు పరుసు వెంకటేశ్వర్లు, మందా కిరణ్, మామిడాల వెంకటేశ్వర్లు, వెంగళరెడ్డి, మస్తాన్, జయకుమార్, మురళీ, రాకేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ నేత భరత్‌కుమార్ యాదవ్

ఘనంగా ప్రపంచ రక్తదాన వారోత్సవం

కావలిటౌన్, జూన్ 14: ప్రతి ఒక్కరు విధిగా రక్తదానం చేయాలని ఆర్డీవో శీనానాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం రెడ్‌క్రాస్ రక్తనిధిలో ప్రపంచ రక్తదాన వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్ అధ్యక్షతన రెడ్‌క్రాస్ రక్తనిధి భవనంలో అతిధులుగా పాల్గొన్న ఆర్డీవో, తహసీల్దారు నాగేష్, ఐఎంఏ అధ్యక్షుడు కె సుబ్బారావులు కేక్‌కట్ చేసి రక్తదాతలకు పంచిపెట్టారు. డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ రక్తంలో గ్రూపులను కనుగొన్న శాస్త్రవేత్త కార్ల్‌ల్యాండ్ స్టీనర్ జన్మదినాన్ని ప్రపంచ రక్తదాన దినంగా జరుపుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు సుధీర్‌నాయుడు, గంధం ప్రసన్న, కలికి శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ శిబిరాన్ని ప్రారంభించి స్వయంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో సీఐ రాజేష్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఖాదర్‌బాషా, అలీం, వివేక్, రఫి, జమీర్ తదితరులు పాల్గొన్నారు.


రెడ్‌క్రాస్‌లో రక్తదానం చేస్తున్న దాతలు

యారవ క్రిష్ణయ్యకు ఎమ్మెల్యే కాకర్ల పరామర్శ

కొండాపురం, జూన్ 14: అనారోగ్యంతో బాధపడుతున్న నెలూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్యను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం పరామర్శించారు. చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి వెళ్లిన యారవ క్రిష్ణయ్యకు గుండెపోటు రావడంతో స్నేహితులు విజయవాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కాకర్ల సురేష్ వైద్యశాలకు వెళ్లి క్రిష్ణయ్యను పరామర్శించి ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ ఎమ్.ఓంకారం, తదితరులు ఉన్నారు.


క్రిష్ణయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

ఇంటూరి గెలుపుతో మాలకొండకు పాదయాత్ర

వలేటివారిపాలెం, జూన్ 14: కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఘన విజయం సాధించిన సందర్భంగా ఆయన సతీమణి సౌజన్య మాలకొండకు పాదయాత్ర చేపట్టారు. మండలంలోని బడేవారిపాలెం నుంచి మాలకొండకు సౌజన్య, కుమారులు అవినాష్, సందీప్‌లు తమ పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి శుక్రవారం సాయంత్రం 3 గంటలకు పాదయాత్ర చేపట్టారు. ముందుగా బడేవారిపాలెం, పోకూరు గ్రామాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బడేవారిపాలెం, పోకూరు, కూనిపాలెం, పోలినేనిపాలెం, వలేటివారిపాలెం, చుండి, అయ్యవారిపల్లె, మాలకొండ గ్రామాలలో కార్యకర్తలు పూలవర్షం కురిపిస్తూ గుమ్మడి కాయలతో దిష్టి తీశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, చెరుకూరి వంశీకృష్ణ, కాకుమాను హర్ష, వలేటి మధుసూదన్‌రావు, కాకుమాను ఆంజనేయులు, తదితరలు పాల్గొన్నారు.


సౌజన్యకు హారతులు పడుతున్న మహిళలు

జనసేన కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

లింగసముద్రం, జూన్ 14 : ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, మంత్రిగా పవన్‌కళ్యాణ్‌ల ప్రమాణ స్వీకారం సందర్భంగా ఫ్లెక్సీ కడుతూ ప్రమాదవశాత్తు విద్యుదాఘానికి గురై మృతి చెందిన కందుకూరు మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన ఇనకొల్లు నరసింహం కుటుంబానికి శుక్రవారం పలువురు ఆర్థిక సాయం అందజేశారు. జనసేన మండల అధ్యక్షుడు అంగుళూరి నరసింహారావు రూ.5000, కందుకూరు జనసేన నాయకుడు దేవళ్ల భాస్కర్‌రావు రూ.10,000, గుడ్లూరు జనసేన నేత భైరవరపు రాజశేఖర్ రూ.5000 నరసింహం కుటుంబానికి అందజేసినట్లు నరసింహం తెలిపారు. వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని తెలిపారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు

కావలి, జూన్ 14: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన ఐదు హామీలపైన సంతకాలు చేయడంతో శుక్రవారం కావలి పట్టణం ఉదయగిరి బ్రిడ్జి కూడలిలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు

కావలి రూరల్, జూన్ 14: రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని ప్రమాదాల నివారణకు రైల్వే విద్యుత్ లైన్‌కు సమీపంలో ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపునకు రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. కావలి పట్టణ కలుగోళమ్మపేట సమీపంలోని అండర్ పాస్ బ్రిడ్జి వద్ద రైల్వే ట్రాక్‌కు సమీపంలో ఉన్న పెద్ద రావిచెట్టు కొమ్మలను శుక్రవారం రైల్వే ఎలక్ట్రికల్ టీఆర్‌డీ అధికారులు తొలగించారు. రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్న ఈ చెట్టు కొమ్మలు విరిగి రైల్వే విద్యుత్ లైన్ల మీద పడే ఉండడంతో వాటిని తొలగించడం వల్ల ఆ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

వలేటివారిపాలెం, జూన్ 14 : గ్రామాల్లో దీర్ఘకాలంగా నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోనున్నట్లు తహసీల్దారు నాగమల్లేశ్వరరావు తెలిపారు. వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఫీక్‌అహ్మద్, డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ప్రభాకర్, ఏవో హమంత్‌భరత్‌కుమార్, పీఆర్ ఏఈ గోపీచంద్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ ప్రసాద్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంబరాలు

కావలిటౌన్, జూన్ 14: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు పట్ల శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ కార్యాలయంలో న్యాయవాదులు సంబరాలు జరుపుకున్నారు. మాజీ ఏజీపీ పోట్లూరు శ్రీనివాసులు కేక్ కట్ చేసి న్యాయవాదులకు తినిపించారు. ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఈ చట్టాన్ని బలవంతంగా ప్రజలపై రుద్దాలని చూశారని మేధావులు, న్యాయవాదులు చట్టాన్ని వ్యతిరేకించినా కొసాగించడం దుర్మార్గమన్నారు. నూతన ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన మాట నిలబెట్టుకుందంటూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బార్ ప్రధానకార్యదర్శి జయప్రకాష్, న్యాయవాదులు సాయిప్రసాద్, రాజేంద్రప్రసాద్, శివప్రసాద్ రెడ్డి, మనోరమ, మంగళగిరి బాబు, రమణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థిని పూజితకు అభినందన

కావలిటౌన్, జూన్ 14: జేబీ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎం పూజిత జాతీయ సమైక్య శిబిరానికి (ఎన్ఎస్ఎస్) ఎంపికయ్యింది. దీంతో శుక్రవారం కళాశాలలో పూజితను ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మాల్యాద్రి, అధ్యాపకులు అభినందించారు. మాల్యాద్రి మాట్లాడుతూ 15 నుంచి 20వ తేదీ వరకు బెంగళూరులో జరగనున్న జాతీయ సమైక్య శిబిరంలో పూజిత పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు భాస్కర్, అయూబ్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి పోరాడుతాం

బిట్రగుంట, జూన్ 14 : బిట్రగుంట రైల్వేస్టేషన్ అభివృద్ధికి భవిష్యత్తులో రైలు రోకో కార్యక్రమాలు చేపడుతామని బిట్రగుంట రైల్వేస్టేషన్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్ నూరుద్దీన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానికు స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూరుద్దీన్, టీడీపీ నేత చిలకపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైల్వేస్టేషన్ అభివృద్ధి విస్మరించి రైల్వే స్టేషన్లో మౌలిక సదుపాయాలను తొలగిస్తూ రైళ్ల స్టాపింగ్‌లు తీసివేస్తూ ప్రజలను ఇబ్బందులు కలుగజేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ జహీర్, శశికుమార్, దాసరి సునీల్, బత్తుల రవిచంద్ర, ఆరోగ్య రాజ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫలితాలపై ఆగ్రహావేశాలు తగదు

బిట్రగుంట, జూన్ 14 : ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ప్రజలు ఆగ్రహావేశాలు ప్రదర్శించరాదని, వివాదాలకు తావులేకుండా ప్రశాంత వాతావరణాన్ని ఏర్పరచాలని కావలి డీఎస్పీ వెంకట రమణ అన్నారు. బోగోలు మండలం ముంగమూరు సచివాలయ ఆవరణలో శుక్రవారం ఆయన గ్రామస్థులతో మాట్లాడారు. గెలుపోటములు సహజమని, ఎవరు కూడా ఆవేశాలకు పోయి సమస్యలు తెచ్చుకోకూడదని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు (విద్య), జూన్ 14 : ఇంటర్, డిగ్రీ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిం చాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం శ్రీహర్ష ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. గతంలో మాదిరిగా పాఠశాల విద్యార్థులతోపాటు ఇంటర్ విద్యార్థులకు కూడా నగదును అందచేయాలని, ప్రభుత్వ కళాశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీటిపై దృష్టి సారించాలని కోరారు. డిగ్రీ విద్యార్థులకు గత వైసీపీ ప్రభుత్వం ఒక విడత మాత్రమే విద్యాదీవెన పథకం నిధులు అందచేసిందని చెప్పారు. గతంలో మాదిరిగా నేరుగా కళాశాలల ఖాతాల్లోనే విద్యాదీవెన జమయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



బక్రీద్‌కు ఏర్పాట్లు చేయాలి : ఎమ్మెల్యే ప్రశాంతి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 14 : బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు చే యాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని ఆమె నివాసంలో నియోజకవర్గంలోని ఎంపీడీవోలు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల్లో తన గెలుపులో నియోజకవర్గ ముస్లింల పాత్ర విలువైందన్నారు.

మంత్రిని కలిసిన సచివాలయ ఉద్యోగుల సంఘం

నెల్లూరు(హరనాథపురం), జూన్ 14 : సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి బెల్లంకొండ పాండురంగ ఆధ్వర్యంలో నాయకులు సచివాలయ, వలంటీర్ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయులను విజయవాడలో శుక్రవారం కలిశారు. నోషనల్ ఇంక్రిమెంట్లు, బకాయి లు, సరెండర్ లీవ్ తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

ఎమ్మెల్యే కోటంరెడ్డిని కలిసిన మెడికవర్ నిర్వాహకులు

నెల్లూరు(వైద్యం), జూన్ 14 : నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా మూడోసారి గెలుపొందిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని మెడికవర్ ఆసుపత్రి నిర్వాహకులు కలిశారు. శుక్రవారం నగరంలోని కోటంరెడ్డి కార్యాలయంలో ఆసుపత్రి హెడ్ డాక్టర్ ధీరజ్‌రెడ్డి, కేన్సర్ విభాగం సెంటర్ హెడ్ డాక్టర్ బిందూరెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ సతీష్, పీఆర్‌వో చందు ఎమ్మెల్యేను కలిసి సత్కరించారు.

రామోజీరావుకు నివాళి


నెల్లూరు(వైద్యం), జూన్ 14 : ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీ రావుకు నగరంలోని పీహెచ్‌పీ కార్యాలయంలో శుక్రవారం నివాళులర్పించారు. పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ ఎందరివో కష్టనష్టాలను మీడియా ద్వారా వినిపించిన వ్యక్తి రామోజీ అని కొనియాడారు. సారా వ్యతిరేక, అక్షరాస్యత వంటి సామాజిక ఉద్యమాల ను ముందుండి నడిపించిన ఆయన మహోన్నత వ్యక్తన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, ఎస్సీ,ఎస్టీమైనార్టీబీసీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు కుడుముల సుబ్బారావు, మహబూబ్‌బాషా, రసూల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, మధుసూదన్ పాల్గొన్నారు.

రేపు జెట్టి శేషారెడ్డి వర్ధంతి

నెల్లూరు(వైద్యం), జూన్ 14 : దివంగత ప్రజావైద్యుడు డాక్టర్ జెట్టి శేషారెడ్డి సేవలను జిల్లా వాసులు ఎవరూ మరిచిపోరని, ఆయన వర్ధంతిని ఆదివారం నిర్వహిస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య తెలిపారు. శుక్రవారం డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వర్ధంతి కార్యక్రమంలో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రజని, ప్రపంచ ప్రజారోగ్య ఉద్యమ సమన్వయకర్త పాండిచేరికి చెందిన డాక్టర్ సుందరరామన్ పాల్గొంటారన్నారు.












సూళ్లూరుపేట హోలీ క్రాస్ కూడలి వద్ద గందరగోళ పరిస్థితి


చంద్రగిరి మండలం ముంగిలిపట్టు వద్ద సిక్స్‌లేన్ రోడ్డుపై ప్రమాదాలకు కారణమవుతున్న కల్వర్టు


చంద్రగిరి మండలం ఐతేపల్లె వద్ద సిక్స్‌లేన్ రోడ్డు మలుపు


రేణిగుంట కేఎల్ఎం ఆస్పత్రి కూడలిలో సూచిక బోర్డులేకుండా గజిబిజిగా ఉన్న రోడ్డు

జాతీయ రహదారులపై మృత్యుఘోష

- జిల్లావ్యాప్తంగా ఆరునెలల్లో 200కుపైగా ప్రమాదాలు
- 90 మంది మృతి, పెద్దసంఖ్యలో క్షతగాత్రులు
- 14 మండలాల్లోని 50 ప్రాంతాల్లో తరచూ యాక్సిడెంట్లు
- రోడ్డు భద్రతా చర్యలు పట్టించుకోని యంత్రాంగం

జిల్లాలో జాతీయ రహదారులు మృత్యు ఘోష వినిపిస్తున్నాయి. ఆరు నెలల్లో 200కు పైగా ప్రమాదాలు సంభవించాయి. వాటిలో 90 మంది మృత్యువాత పడగా పెద్దసంఖ్యలో క్షతగాత్రుల య్యారు. జిల్లావ్యాప్తంగా 14 మండలాల పరిధిలోని 50 ప్రాంతాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పేరుకు జాతీయ రహదారులే అయినా భద్రతా ప్రమాణాల పాటించడంలో సాధారణ రోడ్ల తరహా పరిస్థితులే కనిపిస్తున్నాయి. ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా వారోత్సవాలు జరపడం మినహా ఆచరణాత్మక చర్యలు తీసుకోవడంలో జిల్లా యంత్రాంగం, సంబంధిత శాఖలు విఫలమవుతున్నాయి.

– ఆంధ్రజ్యోతి, తిరుపతి

నాయుడుపేట పరిధిలో 13 మంది దుర్మరణం

సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట, తడ, దొరవారిసత్రం, ఓజిలి, సూళ్లూరుపేట మండలాల్లో జాతీయ రహదారులపై తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆరు నెలల వ్యవధిలో 13 మంది చనిపోగా, పలువురు గాయపడ్డారు. దొరవారిసత్రం మండలం మీదుగా వెళ్లే ఎన్‌హెచ్-16లో నెలబల్లి, వెదురుపట్టు క్రాస్ రోడ్డు, అక్కరపాక క్రాస్ రోడ్డు, మావిళ్లపాడు క్రాస్ రోడ్డు, టపా ఇండ్లు తదితర ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆరు నెలల్లో ఈ మండలంలో ఎనిమిది మంది మరణించారు. నాయుడుపేట మండలం విషయానికొస్తే నాయుడుపేట-మల్లం కూడలి, పండ్లూరు క్రాస్‌ల వద్ద ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆరు నెలల్లో ఏడు ప్రమాదాలు జరిగి, ముగ్గురు మరణించారు. తడ మండలం బోడిలింగాలపాడు, శ్రీసిటీ జీరో పాయింట్, కాదలూరు క్రాస్ రోడ్డు, మాంబట్టు సెజ్ రోడ్డు, పూడి క్రాస్ రోడ్డుల వద్ద అధికంగా దుర్ఘటనలు సంభవిస్తున్నాయి. ఆరు నెలల్లో పది ప్రమాదాలు జరగగా, ఇద్దరు మరణించారు. అనేకమంది గాయపడ్డారు. ఓజిలి మండలం పెద్దపరియ క్రాస్ రోడ్డు, రాజుపాలెం వద్ద, సూళ్లూరుపేట హోలీ క్రాస్ సర్కిల్, కోటపోలూరు క్రాస్ రోడ్డు, హైవే నుంచి చెంగాలమ్మ గుడికి వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి.


తడ మండలం బోడిలింగాలపాడు వద్ద బ్లాక్ స్పాట్

చంద్రగిరి హైవేలపై మాటేసిన మృత్యువు!

చంద్రగిరి నియోజకవర్గం చంద్రగిరి, పాకాల, తిరుపతి రూరల్ మండలాల పరిధిలోని జాతీయ రహదారులపై మృత్యువు మాటేసిందా అన్న రీతిలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఆరు నెలల్లో 91 మంది మృత్యువాత పడగా అందులో 60 మంది ఈ నియోజకవర్గంలోని ప్రమాదాల మృతులే కావడం గమనార్హం. అంతే సంఖ్యలో వాహనదారులు క్షతగాత్రులయ్యారు. ఆరు నెలల వ్యవధిలో ఇక్కడ సుమారు 70కిపైగా ప్రమాదాలు జరిగాయి. చంద్రగిరి మండలంలో పూతలపట్టు- నాయుడుపేట సిక్స్ లేన్ రోడ్డు, తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారి వున్నాయి. ఇందులో సిక్స్‌లేన్ రోడ్డుకు సంబంధించి తొండవాడ, రాయలపురం, ఐతేపల్లె, క్యాండర్ స్కూలు, ఎం.కొత్తపల్లె, ముంగిలిపట్టు, ఎం.కొంగరవారిపల్లె, రవణప్పగారిపల్లెల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారిలో కేఎంఎం కళాశాల, కళ్యాణి డ్యామ్ మలుపు, భాకరాపేట ఘాట్‌లో ఎక్కువగా దుర్ఘటనలు నమోదవుతున్నాయి. ఈ రెండు మార్గాల్లో ఆరు నెలల వ్యవధిలో 35 ప్రమాదాలు జరిగి 35 మంది మరణించగా, 25 మంది గాయపడ్డారు. పాకాల మండలం మీదుగా కూడా సిక్స్ లేన్ రోడ్డు, కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి వెళుతున్నాయి. వీటిలో సిక్స్‌లేన్‌కు సంబంధించి కోనపురెడ్డిపల్లె, తోటపల్లె, నేంద్రగుంట ఫ్లైఓవర్, గుంత గాదంకి వద్ద అధికంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై కట్టకిందపల్లె, పదిపుట్లబైలు గ్రామాల వద్ద ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రెండు మార్గాల్లో ఆరు నెలల కాలంలో పది మంది మృత్యువాత పడగా, 31 మంది గాయపడ్డారు. తిరుపతి రూరల్ మండలం పూతలపట్టు-నాయుడుపేట హైవేలో తాజ్ హోటల్ సమీపంలోని క్రాస్ వద్ద అధికంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ ఆరు నెలల్లో 15 మంది మరణించగా, పలువురు గాయపడ్డారు.

శ్రీకాళహస్తి పరిధిలో తరచూ దుర్ఘటనలు

శ్రీకాళహస్తి నియోజకవర్గం రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో తరచూ రోడ్డు దుర్ఘటనలు జరుగుతున్నాయి. ఆరు నెలల్లో ఏడుగురు చనిపోగా, 55 మంది క్షతగాత్రులయ్యారు. రేణిగుంట మండలంలో రేణిగుంట-కడప మార్గంలోని కట్టపుట్టాలమ్మ గుడి వద్ద యూటర్న్ తీసుకునేచోట ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. అలాగే పూతలపట్టు-నాయుడుపేట సిక్స్‌లేన్ రోడ్డులో గుత్తివారిపల్లె దాబా హోటల్ వద్ద సైతం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సిక్స్‌లేన్ రోడ్డు, రేణిగుంట, రేణిగుంట-చెన్నై జాతీయ రహదారులను కలిపే కేఎల్ఎం ఆస్పత్రి కూడలి వద్ద కూడా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మూడు చోట్లా ఆరు నెలల కాలంలో 43 ప్రమాదాలు జరిగి, 50మంది గాయపడ్డారు. ఏర్పేడు మండలంలో సిక్స్‌లేన్ రోడ్డుపై మేర్లపాక పద్మావతీ హోటల్ మలుపు వద్ద, సీతారామపేట, పల్లంపేట ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఆరు నెలల్లో ఏడుగురు చనిపోగా, ఐదుగురు గాయపడ్డారు.


ఏర్పేడు మండలం మేర్లపాక వద్ద పద్మావతీ హోటల్ సమీపంలోని మలుపు

ప్రమాదాలకు కారణాలివే!

- పాకాల మండలం కోనపురెడ్డిపల్లె, తోటపల్లె వద్ద మలుపులు వున్నాయి. హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు లేవు.
- పాకాల మండలం నేంద్రగుంట ఫ్లైఓవర్ వద్ద సర్వీసు రోడ్డు నుంచి మెయిన్ రోడ్డుపైకి వెళ్లే చోట తగిన జాగ్రత్తలు పాటించడం లేదు.
- పాకాల మండలం గుంతగాదంకి వద్ద పక్కనున్న గ్రామాల వారు రోడ్డు దాటే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.
- పాకాల మండలం చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై కట్టకిందపల్లె, పదిపుట్లబైలు గ్రామాల వద్ద మలుపులున్నాయి. హెచ్చరిక బోర్డులు, స్పీడుబ్రేకర్లు లేవు.
- చంద్రగిరి మండలం ఎం.కొత్తపల్లె వద్ద కల్వర్టు కారణంగా రోడ్డు హఠాత్తుగా పల్లం ఏర్పడి వాహనాలు అదుపు తప్పుతున్నాయి.
- చంద్రగిరి మండలం ఐతేపల్లె, క్యాండర్ స్కూలు వద్ద మలుపులు వుండి వాహనాలు అదుపుతప్పుతున్నాయి.
- తిరుపతి రూరల్ తాజ్ హోటల్ వద్ద కూడలిలో లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రిళ్లు చీకటిగా వుండి అటూ ఇటూ రోడ్డు దాటే సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.
- రేణిగుంట మండలం కరకంబాడి వద్ద కట్టపుట్టాలమ్మ గుడి సమీపంలో రేణిగుంట-కోడూరు ప్రధాన రహదారి నుంచి తిరుపతి వైపు యూటర్న్ తీసుకునే చోట ఎలాంటి హెచ్చరిక బోర్డులు, సూచన బోర్డులూ, స్పీడు బ్రేకర్లు లేవు.
- రేణిగుంట మండలం గుత్తివారిపల్లె వద్ద సిక్స్ లేన్ రోడ్డు నిర్మాణ పనుల వల్ల రోడ్డు ఇరుకుగా మారింది.
- రేణిగుంట కేఎల్ఎం ఆస్పత్రి కూడలి వద్ద గజిబిజిగా వుండి రూట్ మారే సమయంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి.
- ఏర్పేడు మండలం మేర్లపాక పద్మావతీ హోటల్ వద్ద మలుపు వల్ల, సిక్స్ లేన్ రోడ్డు నిర్మాణం వల్ల రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి.
- విజయవాడ-చెన్నై జాతీయ రహదారి నుంచి గూడూరు పట్టణంలోకి వెళ్లే పోటుపాలెం కూడలి వద్ద స్పీడు బ్రేకర్లు లేవు.
- చిల్లకూరు మండలం వరగలి క్రాస్ రోడ్డు కూడలి, కోట క్రాస్ రోడ్డు కూడలి వద్ద మలుపులున్నాయి.
- నాగలాపురం మండలం కృష్ణాపురం, సురుటిపల్లె చెక్ పోస్టుల వద్ద మలుపులున్నాయి. నాగలాపురం శివార్లలో రోడ్డు శిథిలావస్థకు చేరింది.
- వడమాలపేట మండలంలో తిరుపతి-చెన్నై జాతీయ రహదారిపై పాదిరేడు క్రాస్ వద్ద లైట్లు, సైన్ బోర్డులు, స్పీడు బ్రేకర్లు లేవు. దీంతో రాత్రిళ్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ధర్నా చేసినా అధికారులు పట్టించుకోలేదు.


బ్లాక్ స్పాట్‌గా మారిన చిల్లకూరు మండలం వరగలి క్రాస్ రోడ్డు కూడలి

గూడూరులో ఆరు నెలల్లో 5 మరణాలు

గూడూరు నియోజకవర్గం గూడూరు, చిల్లకూరు మండలాల పరిధిలో ఆరు నెలల వ్యవధిలో 20 రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. ఐదుగురు చనిపోగా, 41 మంది క్షతగాత్రులయ్యారు. గూడూరు మండలం పోటుపాలెం కూడలి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆరు నెలల్లో 10 ప్రమాదాలు జరిగి ముగ్గురు చనిపోగా, ఆరుగురు గాయపడ్డారు. చిల్లకూరు మండలం వరగలి క్రాస్ రోడ్డు కూడలి వద్ద, కోట క్రాస్ రోడ్డు కూడలి వద్ద కూడా ఇదే పరిస్థితి. ఆరు నెలల్లో రెండు చోట్లా మొత్తం 10 ప్రమాదాలు జరిగి ఇద్దరు మరణించగా, 35 మంది గాయపడ్డారు.


బ్లాక్ స్పాట్‌గా మారిన గూడూరు - పోటుపాలెం కూడలి

రోడ్డు భద్రతా చర్యల్లో యంత్రాంగం విఫలం

రోడ్డు భద్రతా చర్యలు చేపట్టడంలో జిల్లా యంత్రాంగం విఫలమవుతోంది. ఏటా రోడ్డు భద్రతా వారోత్సవాలు మొక్కుబడిగా జరపడం మినహా నిర్మాణాత్మక చర్యలు తీసుకోవడం లేదు. పోలీసు, రవాణా, ఆర్టీసీ తదితర విభాగాలతో సంయుక్తంగా కలెక్టర్ అధ్యక్షతన రోడ్డు భద్రతా కమిటీ పనిచేస్తుంది. ఈ కమిటీ జిల్లావ్యాప్తంగా రోడ్లను పరిశీలించాలి. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించడంతోపాటు వాటికి కారణాలను గుర్తించాలి. ప్రమాదాలకు కారణమయ్యే మలుపులను, ఎత్తుపల్లాలను, కల్వర్టులను సరిచేయాలి. దీనికి సైంటిఫిక్ సర్వే అవసరం. ఆ దిశగా జిల్లా యంత్రాంగం దృష్టి సారించడం లేదు. దీనికి సమాంతరంగా వాహనాలు నడిపే విషయంలో, ట్రాఫిక్ రూల్స్ పాటించే విషయంలో అటు డ్రైవర్లకు, ఇటు ప్రజలకు కూడా అవగాహన కల్పించాలి. మద్యం తాగి, నిద్రలేమితో వాహనాలు నడపకుండా అవగాహన కల్పించడంతోపాటు ఆ విధంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ కూడా పెంచాలి. ఆచరణలో ఇవేవీ సక్రమంగా జరగడంలేదు.

నాగలాపురం, వడమాలపేటల్లో ఐదుగురు మృతి


వడమాలపేట మండలంలో బ్లాక్ స్పాట్‌గా మారిన పాదిరేడు బైపాస్ రోడ్డు కూడలి

నాగలాపురం, వడమాలపేట మండలాల్లో ఆరు నెలల వ్యవధిలో రోడ్డు ప్రమాదాల బారిన పడి ఐదుగురు చనిపోగా పలువురు గాయపడ్డారు. నాగలాపురం మండలం కృష్ణాపురం మలుపు, నాగలాపురం శివారు, సుబ్బానాయుడు కండ్రిగ, సురుటిపల్లె చెక్‌పోస్టు మలుపు తదితర చోట్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆరు నెలల్లో ఐదు ప్రమాదాలు సంభవించి ఇద్దరు చనిపోయారు. వడమాలపేట మండలం తిరుపతి-చెన్నై జాతీయ రోడ్డులో పాదిరేడు క్రాస్ వద్ద కూడా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆరు నెలల్లో మూడు ప్రమాదాలు జరిగి ముగ్గురు చనిపోయారు.

ధర్మారెడ్డిపై తొలివేటు

- ఈవో (ఎఫ్ఏసీ) బాధ్యతలనుంచి తప్పించిన ప్రభుత్వం
- ఇకపై అదనపు ఈవో పోస్టుకే పరిమితం
- టీటీడీ నూతన ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా శ్యామలరావు నియామకం

తిరుమల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలివేటు టీటీడీ ఈవో (పూర్తి అదనపు బాధ్యతలు) ఏవీ ధర్మారెడ్డిపై పడింది. సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే తిరుమలకు వచ్చిన చంద్రబాబు నాయుడు.. ఇక్కడ్నుంచే ప్రక్షాళన మొదలుపెడతామని చెప్పారు. ఆ ప్రకారం మాజీ సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడు, నమ్మినబంటుగా ఉన్న ధర్మారెడ్డి నుంచే యాక్షన్ మొదలైంది. టీటీడీ ఈవో (ఎఫ్ఏసీ) బాధ్యతల నుంచి ధర్మారెడ్డిని తప్పించి.. కేవలం అడిషనల్ ఈవో స్థాయికి పరిమితం చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న 1997 బ్యాచ్‌కు చెందిన జె.శ్యామలరావును టీటీడీ ఈవోగా నియమిస్తూ శుక్రవారం రాత్రి సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు.


శ్యామలరావు



మళ్లీ తీవ్ర విమర్శలతో..

వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో తొలిసారిగా ధర్మారెడ్డి డిప్యుటేషన్‌పై టీటీడీలోకి వచ్చారు. అప్పట్లో ప్రత్యేకాధికారిగా పనిచేసిన ఈయనకు.. టీటీడీ ఉద్యోగుల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమైంది. ఉద్యోగులకు కనీస ప్రాధాన్యం ఇవ్వకుండా నిరంకుశంగా వ్యవహరించారనే విమర్శలు అప్పట్లో వచ్చాయి. ఓ వివాదాస్పద అంశంలో తీవ్రంగా కన్నీరుమున్నీరవుతూ ధర్మారెడ్డి టీటీడీని వీడారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రాగానే మళ్లీ టీటీడీకి వచ్చిన ఆయన వైఖరిలో ఎలాంటి మార్పులేకపోగా, మరింత మొండిగా వ్యవహరించారని ఉద్యోగ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఐదేళ్లలోనూ అదేస్థాయిలో విమర్శలను మూటగట్టుకున్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో టీటీడీ ఈవో (ఎఫ్ఏసీ) నుంచి ఆయన్ను ప్రభుత్వం తప్పించింది.

వివాదాలకు కేంద్ర బిందువుగా..

వైసీపీ అధికారంలోకి రాగానే కేంద్ర సర్వీసుల్లో ఉన్న ధర్మారెడ్డిని డిప్యుటేషన్‌పై టీటీడీకి తీసుకొచ్చారు. తమ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన ఈయన్ను స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తూ అప్పట్లో సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఇతడి కోసం 'అదనపు ఈవో' అనే పోస్టు సృష్టించి నియమించారు. టీటీడీ ఈవోగా ఉన్న జవహర్‌రెడ్డి సీఎస్‌గా వెళ్లడంతో.. ధర్మారెడ్డి ఈవో (పూర్తి అదనపు బాధ్యతలు) పోస్టులోకి వచ్చారు. ఆ తర్వాత రెగ్యులర్ ఈవోను ప్రభుత్వం నియమించకుండా ఈయన్నే కొనసాగించింది. కనీసం తిరుమలకు జేఈవోనూ నియమించకపోవడం గమనార్హం. ఇలా జగన్ ప్రభుత్వం వెన్నుదన్నుతో టీటీడీలోకి వచ్చిన ధర్మారెడ్డి వివాదాస్పద నిర్ణయాలకు కేంద్రబిందువుగా మారారు. సీఎంకు దగ్గర వ్యక్తి కావడంతో గత టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని కూడా లెక్కచేయని విధంగా నియంతృత్వ పోకడలతో వ్యవహరించారనే విమర్శలు లేకపోలేదు. సర్వదర్శనాలతో ఆదాయం పెద్దగా రాదనేలా వీఐపీ బ్రేక్ దర్శనాల టికెట్ల సంఖ్యను భారీగా పెంచేశారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బ్రేక్ దర్శనాల సమయాన్ని పెంచారు. దీనివల్ల సామాన్య భక్తుల క్యూలైన్లు రెండు నుంచి మూడు కిలోమీటర్ల మేరకు వ్యాపించేలా చేశారని విమర్శలపాలయ్యారు. ఇన్ని కిలోమీటర్ల మేరకు క్యూలైన్లు పెరిగినా ఏ రోజూ దర్శనాల సంఖ్య లక్షకు మించిన దాఖలాలు లేవు. వైసీపీ నేతలకు ఇష్టానుసారం వీఐపీ బ్రేక్ టికెట్లను ఇస్తూ సామాన్యులు దర్శనానికి రావాలంటే ఆలోచించే పరిస్థితులు తీసుకొచ్చారు. ప్రత్యేకించి దళారులను అరికడుతున్నామంటూ శ్రీవాణి ట్రస్టుతో రూ.10,500కు వీఐపీ బ్రేక్ టికెట్లు విక్రయించి ఆ ట్రస్టుకు వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వానికి మళ్లిస్తున్నారనే విమర్శలకు కారకులయ్యారు. గతంలో సర్వదర్శన భక్తులకు కంపార్టుమెంట్లలో కడుపునిండా అన్నప్రసాదాలను అందించేవారు. దీనివల్ల అదనపు భారం పడుతోందనే కారణంతో వీటినీ తగ్గించారనే విమర్శలున్నాయి. కనీసం చంటిబిడ్డలకు పాలు కూడా అందడం లేదని భక్తుల నుంచి పలు సందర్భాల్లో ఆరోపణలు వచ్చాయి. క్యూలైన్‌లో తాగునీరు కూడా ఇవ్వలేదనే విమర్శలు ఎక్కువగానే ఉన్నాయి. టోకెన్ రహిత దర్శనాలను పూర్తిగా రద్దు చేసే దిశగా వ్యవహరించిన తీరు భక్తులను అసంతృప్తికి గురిచేసింది. ఏదోరకమైన టికెట్, టోకెన్ ఉంటేనే తిరుమలకు రావాలనేలా వ్యవహరించారు. వృద్ధులు, దివ్యాంగులు, అంగప్రదక్షిణ టికెట్లను ఆన్‌లైన్‌కే పరిమితం చేశారు. దీంతో చాలా మంది వృద్ధులు, దివ్యాంగులు కిక్కిరిసిపోయేలా ఉండే క్యూలైన్లలోకి ప్రవేశించలేక దర్శనం లేకుండా తిరుగు ప్రయాణమైన సందర్భాలు చాలానే ఉన్నాయి. స్వామికి నైవేద్యంగా పెట్టే అన్నప్రసాదాలను దర్శనం పూర్తిచేసుకున్న భక్తులు ఇచ్చే సంప్రదాయాన్ని దూరం చేశారు. అన్నప్రసాదాల నాణ్యతపై పలుమార్లు భక్తులు మండిపడ్డారు. తమ సమస్యలపై ఉద్యోగులు బయటకు వచ్చి ఆందోళన చేయాలంటే భయపడేలా చర్యలు తీసుకున్నారు. తనకు వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే ఉద్యోగం నుంచి తొలగించడం, లేదా సస్పెండ్ చేయడం, ఒకచోట నుంచి మరోచోటికి బదిలీ చేసేలా వ్యవహరించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



సమావేశంలో టీడీపీ నాయకులు

గూడూరు, జూన్ 14: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలు విశ్వసించి ఈ ఎన్నికల్లో కూటమిని గెలిపించారని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వృద్ధులకు, దివ్యాంగులకు స్వీట్లు పంపిణీ చేసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా చంద్రబాబు ఇచ్చిన హామీల మేరకు ముఖ్యమంత్రి కాగానే 5 హామీలపై సంతకం పెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, వెంకటేవ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, రవీంద్రరెడ్డి, ఇశ్రాయిల్‌కుమార్, పుట్టి నాగరాజు, పెంచలయ్య, అమరయ్య, సునీల్, సద్దాం, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, భారతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

21 యోగా దినోత్సవం



సమావేశంలో డాక్టర్ వంకి పెంచలయ్య తదితరులు

గూడూరు, జూన్ 14: స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పదివేల మంది విద్యార్థులతో యోగా ప్రదర్శన నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా తమ కళాశాలతోపాటు హాలాండ్‌కు చెందిన మహర్షివేదిక్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. మన దేశంలో రుషులు కనుగొన్న యోగాసనాలను నేడు ప్రపంచంలోని అన్ని దేశాలు అనుసరించడం గొప్ప విశేషమన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పీసీ శేఖర్‌రెడ్డి, రఘురామ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాత ప్రాణదాతతో సమానం



రక్తదాన శిబిరంలో సీఐటీయూ నాయకులు

గూడూరు అర్బన్, జూన్ 14: రక్తదాత ప్రాణదాతతో సమానమని సీఐటీయూ నాయకుడు బీవీ రమణయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో సీఐటీయూ ఆధ్వర్యంలో పర్సా సత్యనారాయణ శతజయంతిని పురస్కరించుకుని రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం ద్వారా ప్రాణదానం చేసినవారమవుతామన్నారు. కార్యక్రమంలో శివకుమార్, శశికుమార్, చంద్రయ్య, సురేష్, ప్రసాద్, హరీష్‌కుమార్, కిషోర్, కళ్యాణ్, శ్రీనివాసులు, రమేష్, మధు, డాక్టర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

● సీఐటీయూ నాయకుడు మహేష్

నాయుడుపేట టౌన్, జూన్ 14 : రక్తదానంతో మరొకరికి ప్రాణదానం కలుగుతుందని సీఐటీయూ నాయకుడు మహేష్ అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో సీఐటీయూ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ అమ్మా ఫౌండేషన్ సంస్థ రక్తదాన శిబిరానికి సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ముకుంద, ప్రతాప్, కుమార్, మోహన్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

జీవ ఎరువులతోనే అధిక దిగుబడులు



జీవన ఎరువులను రైతులకు పరిచయం చేస్తున్న వ్యవసాయ నిపుణులు

కోట, జూన్ 14 : జీవ ఎరువులు వాడటం వలన భూసారం పెరగడంతోపాటు అధిక దిగుబడులు వస్తాయని పలువురు వ్యవసాయ నిపుణులు, రైతులు పలు కంపెనీల ప్రతినిధులు అన్నారు. కోటలోని షాదీ మంజిల్‌లో శుక్రవారం కోట, వాకాడు, చిల్లకూరు మండలాల రైతులకు జీవన ఎరువుల వాడకం వలన కలిగే లాభాలను ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ సందర్భంగా జీవన ఎరువులతోపాటు రసాయ ఎరువులను కలిపి వాడితే పంట దిగుబడులు రెండింతలు అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా వరిసాగుపైన దృష్టి కేంద్రీకరించాల న్నారు. ప్రస్తుత సీజన్‌లో ఆయా మండలాలలోని రైతులు ఫిల్టర్ పాయింట్‌ల కింద వరిసాగును చేపట్టి ఉన్నారన్నారు. ఈ పంటలపై జీవన ఎరువులను విధిగా వాడాలన్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాలలోని పలువురు రైతులను ఉత్తమ రైతులను గుర్తించి బయోఫ్యాక్టర్ సంస్థ పలు షీల్డ్‌లతో అభినందించారు. కార్యక్రమంలో రైతు ప్రతినిధి పరంధామరెడ్డి, కృష్ణారెడ్డి, కంపెనీ ప్రతినిధులు సత్యం, ఆంజనేయులు, గంగాధర్‌నాయుడు, వంశీ, సుదర్శన్ ఉన్నారు.

రైల్వేస్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

● రైల్వే డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు సురేంద్ర

నాయుడుపేట, జూన్ 14 : రైల్వేస్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని రైల్వే డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు చిగురాకుల సురేంద్ర కోరారు. నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారాలపై రైల్వే రాకపోకల వివరాల డిస్‌ప్లే ఏర్పాటు చేయడంతో శుక్రవారం రైల్వేస్టేషన్ మేనేజర్‌ను సన్మానించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్, దివ్యాంగుల వీల్‌చైర్, ప్లాట్‌ఫారాల చివర ర్యాంప్‌లు, హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ నాయుడుపేటలో స్టాపింగ్, బిట్రగుంట పాస్ట్‌ప్యాసింజర్‌ను పునరుద్ధరించాలని ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జిల్లా మాజీ కార్యదర్శి ఆశ చెంచుకృష్ణయ్య, అమరావతి రామయ్య, వెంకటేశ్వర్లు, కొప్పోలు సుబ్రహ్మణ్యం, మురళీనాయుడు ఉన్నారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉపాధి కల్పించాలి

నాయుడుపేట టౌన్, జూన్ 14 : ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని ఓజిలి బెవరేజెస్ డిపో పరిధిలోని ఉద్యోగులు శుక్రవారం నాయుడుపేటలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని కలిసి కోరారు. ఓజిలి పరిధిలోని డిపోలో దాదాపు 580 మంది ప్రభుత్వం మద్యం దుకాణంలో సూపర్‌వైజర్లుగా, సెల్స్‌మెన్‌గా 5 సంవత్సరాలుగా పనిచేస్తున్నామన్నారు. నూతన ప్రభుత్వ మద్యం దుకాణాల విధానంతో పాత పద్ధతిన జరుగుతాయని ప్రచారం ఉందన్నారు. తాము డిగ్రీ, పీజీలు పూర్తిచేసి 35ఏళ్ల పైబడి ఉన్నామని, తమకు ఇతర ప్రభుత్వ విభాగాలలో ఉపాధి కల్పించాలని ఆమేర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు.

ఐదేళ్ల అరాచక పాలనకు ప్రజలు బుద్ధి చెప్పారు

టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి

సూళ్లూరుపేట, జూన్ 14: వైసీపీ ఆరాచక పాలన, దౌర్జన్యాలతో విసిగిపోయిన ప్రజలు ఎన్నికల్లో ఓటు రూపంలో ఆ పార్టీకి బుద్ధి చెప్పారని టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి పార్కు వీధిలోని వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద టీడీపీ నాయకుడు నాపా మునిరాజా ఆధ్వర్వర్యంలో జరిగిన టీడీపీ విజయోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేనాటి మాట్లాడుతూ ఎన్డీయే కూటమికి ఇంతటి చరిత్మాక విజయాన్ని అందించిన ప్రజలకు టీడీపీ ఎళ్లవేళలా రుణపడి ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు అర్బన్, జూన్ 14: పట్టణంలో శనివారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8:30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు గూడూరు పట్టణం, మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ డీఈ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

19న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

వెంకటగిరిటౌన్, జూన్ 14: ఏపీ మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతుల్లో ప్రవేశానికి జూన్ 19వ తేది ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ తులసీజ్యోతి శుక్రవారం తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు శనివారం, మంగళవారం ధరఖాస్తులు స్వీకరిచబడునని, ఆధార్, స్టడీ సర్టిఫికేట్, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో మంగళవారంలోపు ధరఖాస్తు చేసుకోవాలని కోరారు.

20న ఐఐహెచ్‌టీలో స్పాట్ అడ్మిషన్లు

వెంకటగిరిటౌన్, జూన్ 14: పట్టణంలోని ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ కళాశాలల్లో మూడేళ్ల డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 20వ తేది స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి వరప్రసాద్ తెలిపారు. 10వ తరగతి పాసైన అభ్యర్థుల మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఈ కోర్సు చేసిన విద్యార్థులు బీటెక్ రెండో సంవత్సరంలో నేరుగా చేరే అవకాశం ఉందన్నారు. వివరాలకు ఐఐహెచ్‌టీవీజీఆర్.కామ్‌ను సందర్శించగలన్నారు. ఈ నెల 20న నేరుగా కళాశాలకు హాజరుకావాలని కోరారు.

పంటలపై దృష్టి సారించాలి

వెంకటగిరిటౌన్, జూన్ 14: రైతులు వేసిన పంటలపై అధికారులు దృష్టి సారించాలని ఏడీఏ నాగర్జునసాగర్ పేర్కొన్నారు. శుక్రవారం ఏడీఏ కార్యాలయంలో ఏవోలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుతడి పంటలు, మట్టి నమూనాల సేకరణ, పచ్చిరొట్ట పైర్లు సాగు వాటిపై దృష్టి పెట్టి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు ఆర్బీకేల ద్వారా ఎరువులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవోలు పాల్గొన్నారు.

చిన్నారులపై పిచ్చికుక్క దాడి

తడ, జూన్ 14 : ఇంటి ముందర ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులపై పిచ్చికుక్క దాడిచేసి గాయపరచింది. స్థానిక సూళ్లూరువీధిలో ఏడాదిన్నర వయస్సు కలిగిన ధనుష్, నందా శుక్రవారం సాయంత్రం ఇంటి ముందర ఆడుకుంటున్నారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న ఓ కుక్క వారిద్దరిపై దాడిచేసి గాయపరచింది. దీంతో పక్కనే ఉన్న చిన్నారుల తల్లిదండ్రులు కుక్కను తరవడంతో అది వెళ్లిపోయింది. వెంటనే వారిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

కారును ఢీకొన్న లారీ : ఒకరికి గాయాలు



చిల్లకూరు, జూన్ 14: మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలో శుక్రవారం కారును లారీ ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. కోట గ్రామానికి చెందిన సులోచనమ్మ కారులో కోట నుంచి నెల్లూరువైపు వెళుతోంది. ఈ క్రమంలో అదే మార్గంలో వెళుతున్న లారీ కారును వెనుక నుంచి ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న సులోచనమ్మకు గాయాలయ్యాయి. గాయపడిన సులోచనమ్మను గూడూరు ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కారులో సులోచనమ్మతోపాటు డ్రైవర్ చిరంజీవి, మరొక మహిళ ఉన్నారు. డ్రైవర్, మరో మహిళకు ఎలాంటి గాయాలు లేవు.

శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలి

వెంకటగిరిటౌన్, జూన్ 14: పట్టణంలోని కాశీపేట కూడలిలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలని బీజేపీ మాజీ నియోజకవర్గ కన్వీనర్ తమటం మణి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు అడుగుల స్థలం కేటాయించాలన్నారు. ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

16న ఎన్‌బీకేఆర్‌లో కోర్సులపై అవగాహన సదస్సు

కోట, జూన్ 14 : విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 16 తేదీన కొత్తగా కోర్సుల్లో చేరే విద్యార్థులకు అవగాహన సదస్సు జరుగుతుందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ ఏడాది ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చేరే విద్యార్థులకు కళాశాలలో ఉన్న పలు కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహించదలచామన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుపై బార్ అసోసియేషన్ హర్షం

వెంకటగిరి, జూన్ 14 : ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దుపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొన్న నిర్ణయం హర్షనీయమని వెంకటగిరి కోర్టు బార్ అసోసియేషన్ లాయర్లు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు కోర్టు ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది న్యాయవాదుల విజయమని అన్నారు. కార్యక్రమంలో న్యావాద సంఘం ఉపాధ్యక్షులు బీరం మురళీకృష్ణ, విజకుమార్, హరినాథరెడ్డి, రాజారావ్, వాసు, స్వప్నమహేంద్ర, గురుప్రసాద్, గాంధీ తదితరులు వున్నారు.

ఆల్తూరుపాడు రిజర్వాయరుపై ప్రత్యేక దృష్టి

డక్కిలి, జూన్ 14 : మండలంలోని ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి త్వరలో పనులు తిరిగి మొదలు పెడతామని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణానికి సంబంధించి తెలుగు గంగ ఈఈ రాధాకృష్ణతో మాట్లాడారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2018లో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మొదలు పెట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే రీటెండరు పేరుతో పనులు నిలిపివేసిందన్నారు. టీడీపీ తిరిగి అధికారంలోకి వచ్చింది కాబట్టి ప్రాజెక్టు నిర్మాణం విషయమై ముఖ్యమంత్రి దృష్టికి మరోసారి తీసుకెళ్లి పనులు మొదలు పెడతామని చెప్పారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా

ఎమ్మెల్యేకి ఆహ్వానం ఇవ్వలేదు ● వాయిదా వేయాలని టీడీపీ కౌన్సిలర్లు డిమాండ్ ● టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం, వాయిదా



కౌన్సిల్ సమావేశం

వెంకటగిరిటౌన్, జూన్ 14: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు ఆహ్వానం అందలేదని టీడీపీ కౌన్సిలర్లు కె. చంద్రశేఖర్ రెడ్డి, నారి శేఖర్ ధ్వజమెత్తారు. మున్సిపల్ కార్మికులకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని, వారి జీతాలకు మేము అడ్డుపడమని, అయితే ఈ కౌన్సిల్ సమావేశాన్ని ఎమ్మెల్యే వచ్చేవరకు వాయిదా వేయాలని కోరారు. అనంతరం వైసీపీ కౌన్సిలర్ వహిదా మాట్లాడుతూ కార్మికుల జీతాల అంశాల అజెండాను ఆమోదించాలని డిమాండ్ చేశారు. పది రోజుల్లో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణని ఆహ్వానించి మరో సమావేశం పెట్టుకుందామని తెలిపారు. టీడీపీ కౌన్సిలర్లు ఒప్పుకోకపోవడంతో వారి ఇద్దరి మధ్య వాగ్వాదం చేటుచేసుకుంది. చైర్‌పర్సన్ చొరవ తీసుకుని కౌన్సిలర్లతో మాట్లాడారు. దీంతో కౌన్సిల్ సమావేశం వాయిదా పడడంతో చర్చకు దారితీసింది. ఈ విషయంపై ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను వివరణ కోరగా కౌన్సిల్ సమావేశం ఉందని సమాచారం ఇచ్చారు. అయితే అసెంబ్లీలో ప్రమాణా స్వీకారం చేసిన అనంతరం కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని కోరామని తెలిపారు. గత ఏడాదిగా మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిని బండారాన్ని బయట తీస్తామని హెచ్చరించారు. ప్రజల సొమ్ము పక్కదారి పట్టినా అణపైసాతో సహా బయటకు తీస్తామన్నారు.

తీరప్రాంత గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు

అటవీశాఖ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు





అట్టకానితిప్పలో ఏర్పాటు చేసిన తాగునీటి ప్లాంట్, శుద్ధి చేసిన నీటిని పట్టుకొంటున్న గ్రామస్తులు

సూళ్లూరుపేట, జూన్ 14: తీరప్రాంత గ్రామాల్లో ప్రజల తాగునీటి కష్టాలను గుర్తించిన అటవీశాఖ అధికారులు ప్రజల దాహార్తి తీర్చాలని నడుం బిగించి వారికి స్వచ్ఛమైన తాగునీరందించాలని ప్రత్యేక చొరవ తీసుకొన్నారు. దీంతో ప్రతిపాదనలు తయారుచేసి వారికి వచ్చే నిధులతో ఆ గ్రామాల్లో మినరల్ నీటి ప్లాంట్లను ఏర్పాటు చేసి తాగునీరందించి దాహార్తి తీర్చుతున్నారు. పులికాట్ తీరప్రాంత గ్రామాల్లో కడపట్ర, దామరాయి, కొరిడి పంచాయతీలున్నాయి. ఈ పంచాయతీల పరిధిలో దాదాపు 23 గ్రామాలున్నాయి. ఈ గ్రామాలకు తాగునీరందించేందుకు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చుచేసినా ఉప్పునీరు, కలుషిత నీరే తప్ప స్వచ్ఛమైన తాగునీరు వారికి అందదు. ఈ ప్రాంతంలో పులికాట్ పక్షుల రక్షిత కేంద్రం,నేలపట్టులో పక్షుల సంతానోత్పత్తి కేంద్రాలను పర్యవేక్షించేందుకు సూళ్లూరుపేట డివిజనల్ అటవీశాఖ కార్యాలయం ఉంది. వీరికి వచ్చే నిధులతో ఈ ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో వన్యప్రాణి అధికారులు మినరల్ నీటిప్లాంట్లను ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందజేస్తున్నారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకు నీటి ప్లాంట్లు..

మండల పరిధిలోని అట్టకానితిప్పలో ఉన్న పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో ఇటీవలే రూ.3 లక్షల వ్యయంతో తాగునీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులే కాకుండా పులికాట్ సందర్శనకు వచ్చే వారికి ఎంతో ఉపయోగపడుతోంది. అదే విధంగా రాగన్నపట్టెడ ఉన్నత పాఠశాలలో రూ.2.77 లక్షలతో, దామరాయిలో రూ.2.22 లక్షల హెచ్చించి నీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఈ తాగునీటి ప్లాంట్ల ద్వారా ఈ ప్రాంత ప్రజలు స్వచ్ఛమైన తాగునీరు అందుతున్నాయి.

ఇకపై ఎవరి భూమిపై వారికే హక్కు

ఎమ్మెల్యే కురుగొండ్ల



ఎమ్మెల్యే రామకృష్ణను యాలకల మాలతో సత్కరిస్తున్న నాయకులు

వెంకటగిరి, జూన్ 14 : ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తొలిరోజే ల్యాండ్ టైటలింగ్ చట్టం రద్దుపై సంతకం చేయడంతో ఇకపై ఎవరి భూమిపై వారికే హక్కు వుంటుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక తెలుగుగంగ అతిథి గృహంలో ఆయన రైతులు, పింఛనుదార్లు, డీఎస్సీకి సిద్ధం అవుతున్న విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దుతో రైతుల కళల్లో ఆనందం కనించిందన్నారు. వృద్ధాప్య పింఛను రూ.4 వేలు, దివ్యాంగుల పింఛను రూ.6వేలు చేయడం ద్వారా అవ్వాతాతల్లోనే కాదు రైతుల్లో హర్షాదిరేఖలు వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. డీఎస్సీ ద్వారా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో తొమ్మిది వందలకు పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందే అవకాశం ఏర్పడిందన్నారు. అంతకు ముందు ఆయన్ను పలు శాఖల అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు వచ్చి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, పప్పు చంద్రమౌళిరెడ్డి, తంబిశెట్టి శివారెడ్డి, పునుగోటి విశ్వనాథనాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, అవ్వారు సత్యనారాయణ, బీరం రాజేశ్వరరావు, మచ్చల వేణు, మాల్లారం బాబు, నరిసింహులు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు హేమంత్ చౌదిరి, సుకుమార్, నాని, చంటి తదితరులు పాల్గొన్నారు.

పాళెంతోపు గ్రామస్తుల కోరిక నెరవేరేనా?



పూడికుప్పం వద్ద మత్స్యకారులు వేసుకున్న రేకులషెడ్లు

తడ, జూన్ 14 : తమ గ్రామస్తులందరిని పక్కనే ఉన్న మరో గ్రామం వద్ద నివాసం ఉండేందుకు అనుమతించాలంటూ గత నాలుగేళ్లుగా వేడుకుంటున్న పాళెంతోపు కుప్పం గ్రామస్తుల కోరిక ఇప్పుడైనా నెరవేరేనా... అంటూ ఆ గ్రామస్తులు ఆశగా ఎదురుచూస్తున్నారు. పులికాట్ సరస్సు మధ్యలో ఉండే ఇరకం దీవిలో ఉన్న మత్స్యకార గ్రామమే పాళెంతోపుకుప్పం గ్రామం. గ్రామస్తులంతా మత్స్యకారులే. పులికాట్‌లో దొరికే మత్స్యసంపదపై ఆధారపడి జీవించేవారే. అయితే పులికాట్ సరస్సు పూడుకుపోవడం, తద్వారా నీళ్లరాక గగనమవడం, దాంతో మత్స్యసంపద అరకొరగా దొరుకుతుండటంతో వారికి రోజుగడవడం కష్టమైపోయింది. దీంతో కుల వృత్తిని వదులుకొని ప్రత్యామ్నాయంగా కూలిపనులకు వెళ్లడం కొంతమంది అలవాటు చేస్తున్నారు. తద్వారా దగ్గర్లో ఉన్న పరిశ్రమలకు వెళ్లివస్తున్నారు. వాస్తవంగా పాళెంతోపుకుప్పం వెళ్లాలంటే భీములవారి పాళెం నుంచి పడవలో గంటపాటు ప్రయాణించి గ్రామానికి చేరుకోవాల్సిన పరిస్థితి. దీంతో తెల్లవారుజామున ఇళ్లువదిలి వస్తే ఏ రాత్రికో ఇంటికి చేరుకోవాల్సిన పరిస్థితి. జీవనోపాధికి తప్పనిసరై గ్రామం వదిలి వెళ్లాలని గ్రామస్తులంతా నిర్ణయానికి వచ్చారు. మూడేళ్ల క్రితం విషయాన్ని అప్పటి వైసీపీ నాయకుల దృష్టికి అధికారులకు తీసుకువచ్చారు. పూడికుప్పం గ్రామం వద్ద ప్రభుత్వానికి సంబంధించిన 8 ఎకరాల భూములు ఉన్నాయని, వాటిలో తమకు నివాసస్థలాలు ఇచ్చి ఆదుకోవాలని వేడుకున్నారు. గ్రామంలో మొత్తం 350 వరకు గడపలు ఉండగా, అందరికి అక్కడే స్థలాలు కేటాయించాలని అర్జీలు పెట్టుకున్నారు. అందుకు పూడికుప్పం గ్రామస్థులు సైతం మనస్ఫూర్తిగా ఆహ్వానించి వారిని తాము అక్కును చేర్చుకుంటామని హామీ ఇచ్చారు. ఇంత జరిగాక ఆ స్థలాలు ఇచ్చేందుకు అధికారులు ఎందుకో మీనమేషాలు లెక్కించారు. ఇదిగో అదిగో అంటూ కాలయాపన జరిగింది. తీరా మరో రెండు, మూడు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందనగా పూడికుప్పంలో స్థలాలు కేటాయిస్తామంటూ హడావుడి చేశారు. సర్వే జరిగింది. దీంతో గ్రామస్తులు అక్కడ చిన్నపాటి రేకుల షెడ్‌లను ఏర్పాటు చేసుకొని ఇక ఈ స్థలాలు తమకేఅంటూ పొంగిపోయారు. కాని అధికారులు మాత్రం ఇంతవరకు వారికి అధికారికంగా స్థలాలను అప్పగించలేదు. ఇప్పుడేమో అధికార మార్పిడి జరిగింది. టీడీపీ అధికారంలోకి వచ్చింది. ఇప్పటికైనా ఆ స్థలాలను తమకు అప్పజెప్పి ఇళ్లుకట్టించి ఇస్తారన్న ఆశగా పాళెంతోపుకుప్పం గ్రామస్థులు ఎదురుచూస్తున్నారు. మరీ వారి కళ నేరవేరుతుందా... వారి కష్టాలు తీరుతాయా... అన్నది వేచిచూడాల్సిందే.

మెగా డీఎస్సీతో నిరుద్యోగుల్లో చిగురించిన ఆశలు

● ఎమ్మెల్యే విజయశ్రీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట, జూన్14: ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి సంతకం పెట్టిన మెగా డీఎస్సీతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ సీనియర్ నేత శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డితో కలసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు పాలనతో రాష్ట్రాభివృద్ధి శరవేగంగా అభివృద్ధి జరుగుతుందని అన్నారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వైసీపీ పాలనలో రైతులు, నిరుద్యోగ యువత నానాకష్టాలు పడ్డారని, ఇక ఆ కష్టాలు పడకుండా ఉండాలని ఓటు అనే వజ్రాయుధం ద్వారా చంద్రబాబుకు పట్టంకట్టారన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు రమేష్, శంకరయ్య, విజయకుమార్‌నాయుడు, శంకరయ్య, శ్రీనివాసులునాయుడు, కృష్ణయ్య, అశోక్‌రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, పసల గంగాప్రసాద్, మధునాయుడు, దార్ల రాజేంద్ర, బాబు, సుధీర్, నాగేంద్రరెడ్డి, సుబ్బారావు, నారాయణ, రవి, చెంగయ్య, చక్రపాణి ఉన్నారు.

తిప్పగుంటపాళెంలో అంగన్‌వాడీ బడిబాట

చిల్లకూరు, జూన్ 14: తిప్పగుంటపాళెంలో శుక్రవారం అంగన్‌వాడీ సిబ్బంది బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ రేణుక మాట్లాడుతూ 3 ఏళ్లు నిండిన చిన్నారులను గుర్తించి చిన్నారులను అంగన్‌వాడీలకు పంపేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించామన్నారు. అదేవిధంగా గర్భిణీలు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని వారికి సూచించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో బండెద్దు మృతి

సూళ్లూరుపేట, జూన్ 14: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయ ఆర్చీ సమీపంలో ఇసుక బండిని కంటైనర్ ఢీకొన్న ప్రమాదంలో ఒక ఎద్దు మృతి చెందింది. మన్నారుపోలూరుకు చెందిన బాధితుడు వంకా మధు కథనం మేరకు కాళంగి నది నుంచి ఎద్దల బండిలో ఇసుకలోడు తీసుకొచ్చి పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఇసుకు దించేసి వెళ్తుండగా వెనుకనే ఓ కంటైనర్ మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి ఇసుక బండిని ఓ సైడ్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒక ఎద్దు మృతి చెందింది.

మొరాయించిన బీసీ గురుకులాల వెబ్‌సైట్ సర్వర్లు

కోట, జూన్ 14 : మూడు రోజులుగా బీసీ గురుకులాల వెబ్‌సైట్ సర్వర్లు పూర్తిగా పనిచేయకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి నెల్లూరుజిల్లాలో గొలగమూడి, వెంకటాచలం, సౌత్‌ఆములూరు, కోట, గూడలి, దొరవారిసత్రం, గూడూరు, (విద్యానగర్) తదితర బీసీ బాలుర, బాలికల గురుకులాలలో బ్యాక్‌లాగ్ మిగులు సీట్లు అయిన 6, 7, 8, 9 తరగతుల్లో ప్రవేశాలకు ఈ నెల 5 నుంచి 15లోపు ఆయా తరగతుల్లో ప్రవేశాలకు సంస్థ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటన చేశారు. అయితే ఆ సంస్థ వెబ్‌సైట్ సర్వర్లు మూడు రోజులుగా పనిచేయకపోవడం, శనివారం ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకునేందుకు చివరితేదీ కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వెబ్‌సైట్‌లో పనిచేసి ఉంటే తమ సీటు దొరికే అవకాశం ఉండేదేమోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ గురుకులాల జిల్లా కన్వీనర్ కోరాడా నారాయణరావును వివరణ కోరగా వెబ్‌సైట్ సర్వర్లు పనిచేయకపోవడం వాస్తవమే అన్నారు. ఈ విషయాన్ని ఆ శాఖల్లోని ఉన్నతాధికారులకు తీసుకువెళ్లామన్నారు.

కోలితోటలో సోమిరెడ్డి, కురుగొండ్ల పూజలు

డక్కిలి, జూన్ 14 : ప్రముఖ పుణ్యక్షేత్రం వెలుగొండ కొండ కింద వెలసిన కొలితోట చెంచమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి సర్వేపల్లి, వెంకటగిరి ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, టీడీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆనం వెంకట్రామిరెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు తీర్చుకొన్నారు. వీరికి ఆలయ ఈవో శ్రీనివాసులు రెడ్డి స్వాగతం పలికారు. ఆ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పప్పు చంద్రమౌళిరెడ్డి, తంబిశెట్టి శివారెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు తదితరులు వున్నారు.

శ్రీకాళహస్తి ఎమ్మెల్యేను కలిసిన టీడీపీ నాయకులు



పెళ్లకూరు, జూన్ 14: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని శుక్రవారం పెళ్లకూరు మండల నాయకులు శ్రీకాళహస్తిలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వట్టికుండల శేఖర్‌నాయుడు, నాయకులు ప్రసాద్ నాయుడు, హరినాయుడు సిద్ధలయ్య నాయుడు, యుగంధర్, గురవయ్య, వెంకటేశ్వర్లు, పరశురాం వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.